@vaartanews @mvnewstv

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com

TGBIL/25/A0512

సోమవారం
26 అక్టోబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక :113
పేజీలు : 12 వెల : 5/-

MN MEDIA PUBLICATION PVT LTD








PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |


## ఓటు నమోదుకు ముందుకు రాని

# యువత!

- తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించి దాదాపు నెల రోజులు
- ఇప్పటివరకు 5,23,758 మంది మాత్రమే దరఖాస్తు
- మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పరిధిలో 2,29,937
- వరంగల్-ఖమ్మం-నల్గొండ పరిధిలో 2,93,821 మంది మాత్రమే దరఖాస్తు
- ఫారం-18 సమర్పించడానికి నవంబర్ 6 వరకే ఎన్నికల సంఘం అవకాశం
- ఈసారి ఆశించిన స్థాయిలో ఓటర్ల నమోదు కాకపోవడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యేకంగా క్యాంపులు పెట్టే అంశంపై దృష్టి
- మరోవైపు రెండు ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఫారం-18 ద్వారా వచ్చిన కొత్త దరఖాస్తుల విచారణ ఇంకా బీఎల్‌వో స్థాయిలోనే ఉండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.



హైదరాబాద్

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓటు నమోదు (ఫారం-18) కోసం గ్రాడ్యుయేట్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించి దాదాపు నెల రోజులు కావొస్తున్నా శనివారం వరకు రెండు స్థానాలకు కలిపి 5,23,758 అప్లికేషన్లు మాత్రమే వచ్చాయి. కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం సెప్టెంబర్ 28న నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటివరకు మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పరిధిలో 2,29,937, వరంగల్-ఖమ్మం-నల్గొండ పరిధిలో 2,93,821 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఫారం-18 సమర్పించడానికి నవంబర్ 6 వరకే ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 2021లో జరిగిన ఎన్నికల్లో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పరిధిలో 5,31,268 మంది, వరంగల్-ఖమ్మం-నల్గొండ పరిధిలో 5,05,565 మంది కలిపి మొత్తంగా రెండు నియోజకవర్గాల్లో 10 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఈసారి ఆశించిన స్థాయిలో ఓటర్ల నమోదు - మిగతా 10లో

## ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ డౌన్



- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- నిపుణుల హెచ్చరికలు
- శీతాకాలం సమీపించిన వేళ, ఢిల్లీలో మరోసారి కాలుష్యం కోరలు చాస్తోంది
- వాయు నాణ్యత తగ్గిపోయి హానికరగాలులతో దేశ రాజధాని ఉక్కిరిబిక్కిరవుతోంది.
- ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై ఇది తీవ్ర ప్రభావం

## హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై

# ఏఐ నిఘా

- ట్రాఫిక్, వ్యర్థాల నియంత్రణే లక్ష్యంగా ఏర్పాట్లు
- హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఈ ఏఐ కెమెరాల ప్రణాళిక సిద్ధం
- మరికొన్ని రోజుల్లో దీనిని అందుబాటులోకి తీసుకురానున్నారు.
- నిర్మాణ వ్యర్థాలు, చెత్త వేయకుండా కట్టడి చేసేందుకు ఏఐ - ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.



హైదరాబాద్

హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), సర్వీసు రోడ్ల వెంట తరచూ చెత్తను పారేస్తూ ఉంటారు. దీనిని అరికట్టేందుకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఒక ప్రణాళికను రూపొందించింది. నిర్మాణ వ్యర్థాలు, చెత్త వేయకుండా కట్టడి చేసేందుకు ఏఐ - ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా అక్రమంగా వ్యర్థాలను పారబోసే వాహనాలను ఆటోమేటిక్‌గా గుర్తించి, వాటి లైసెన్స్ ప్లేట్ నంబర్లను నమోదు చేస్తుంది. అలా చెత్త వేసిన వారికి భారీ జరిమానాలు విధించనున్నారు. అంతేకాకుండా ఓ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తుంది. దీనిద్వారా వ్యర్థాలను వేస్తున్న వాహనాలపై తక్షణ చర్యలు తీసుకొనే వీలుంటుంది. ప్రస్తుతం అండర్‌పాస్‌ల సమీపంలో జనసంచారం తక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాలలో - మిగతా 10లో



## ఉగ్రవాదం ప్రపంచ శాంతికి ప్రాణాంతకమైన ముప్పు

- ఉగ్రవాదాన్ని రాజకీయ సాధనంగా ఉపయోగించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు
- ప్రపంచ దేశాలు దృఢ సంకల్పంతో ఏకమై దీనిని ఎదిరించాలని పిలుపు
- విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్

## ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు

- బ్యాంకింగ్ రంగానికి సైబర్ ముప్పు
- రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయి
- భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది
- 'నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగవని మనందరికీ తెలుసు
- ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



## రైస్ మిల్లర్ల అక్రమాలపై

# ఉక్కుపాదం

- సన్నబియ్యం సరఫరాలో అక్రమాలపై రంగంలోకి సీఐడీ
- 14 మంది మిల్లర్లు అరెస్ట్
- నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులపై సీబీసీఐడీ అధికారులు దాడులు
- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మకం
- పౌర సరఫరాల సంస్థ అధికారుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన దర్యాప్తు బృందం
- ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు నమోదు.. 14 మంది మిల్లర్లను అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడి



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రైస్ మిల్లర్ల అక్రమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వం ఇచ్చిన నాణ్యమైన సన్న రకం ధాన్యాన్ని పక్కదారి పట్టించి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి దొడ్డు రకం బియ్యం అప్పగిస్తున్న అక్రమార్కులపై సీఐడీ విభాగాన్ని రంగంలోకి దించింది. పౌర సరఫరాల సంస్థ అధికారుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన దర్యాప్తు బృందం, ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి, 14 మంది మిల్లర్లను అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. 2025--26 ఖరీఫ్ సీజన్‌లో పౌర సరఫరాల శాఖ 71.86 లక్షల మెట్రిక్ - మిగతా 10లో



## మోదీపై ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

- చెలరేగిన రాజకీయ దుమారం
- దేశవ్యాప్తంగా నిరసనలకు బీజేపీ సిద్ధం!
- ప్రధాని మోదీకి, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్
- ప్రభుత్వం ప్రజాస్వామ్య సూత్రాల్ని ఉల్లంఘిస్తోంది
- సర్ ప్రక్రియ ద్వారా ఎన్నికల్ని ప్రభావితం చేస్తోంది
- ఓ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ తండ్రిని ప్రస్తావిస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీయగా

## చిల్లర కోసం

# గొడవ

- మహిళా కండక్టర్‌ను బస్సులోంచి తోసేసిన ప్రయాణికురాలు
- టికెట్ విషయంలో మొదలైన వాగ్వాదం
- చిల్లర విషయంలో పెరిగిన వివాదం
- కదులుతున్న బస్సు కింద పడి గాయాలు
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు



హైదరాబాద్

ప్రయాణికురాలితో చిల్లర విషయంలో జరిగి న వాగ్వాదం ఓ మహిళా ఆర్టీసీ కండక్టర్‌కు తీవ్ర గాయాలు కావడానికి దారితీసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో టికెట్ తీసుకోవడం, మిగిలిన చిల్లర ఇవ్వడం వంటి విషయాలపై మొదలైన వివాదం చివరకు ప్రమాదానికి దారితీసింది. కండక్టర్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిట్టగూడెంకు చెందిన ఓ ప్రయాణికురాలు మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు - మిగతా 10లో

# హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో రూ.2.07 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ

- అభివృద్ధి పనులను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**నాచారం, అక్టోబర్ 25 ( మన మీ వార్త):**

హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో మొత్తం రూ.2 కోట్ల 7 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, వర్షపు నీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిజెన్ శేఖర్‌తో కలిసి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.

**వివిధ కాలనీల్లో అభివృద్ధి పనులు**

ఇందిరానగర్‌లోని లెఫ్ట్ వీధులు 2, 3, 4, 5, 7లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.49.80 లక్షలు కేటాయించారు. జాన్సన్ గ్రామర్ స్కూల్ వద్ద డ్రైనేజీ, వర్షపు నీటి పైప్‌లైన్ పనుల కోసం రూ.70.20 లక్షలు వెచ్చించనున్నారు.

సరస్వతీ నగర్‌లోని మెయిన్ రోడ్డు నుంచి హెచ్ఎంటీ నగర్ స్ట్రీట్ నంబర్ 5 వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.39.40 లక్షలు కేటాయించారు. బాపూజీ నగర్‌లోని రోడ్లు 1, 2లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.49.80 లక్షలతో పనులు చేపట్టనున్నారు.

ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ఆయా కాలనీల్లో రహదారుల సౌకర్యం మెరుగుపడటంతో పాటు డ్రైనేజీ, వర్షపు నీటి నిర్వహణ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో ఏఈ సూరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, సంబంధిత కాలనీల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ బైక్ ర్యాలీ

**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 25, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరిశీచుకొని తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నగరంలో సైకిల్, బైక్ ర్యాలీ నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు అదనపు డిసిపి (అడ్మిన్) శుభం ప్రకాష్ ఆధ్వర్యంలో సైకిల్ / బైక్ ర్యాలీ ఆదివారం ఉదయం 8 గంటలకు పూలాంగ్ చౌరస్తా నుండి అదనపు పోలీస్ కమిషనర్ శుభం ప్రకాష్ జండాఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పూలాంగ్ చౌరస్తా నుండి ప్రగతి హాస్పిటల్, ఎల్ఐసి చౌరస్తా, కోర్టు చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా , పోలీస్ హెడ్ క్వార్టర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎందరో పోలీస్ సిబ్బంది అంతర్గత భద్రత కాపాడటానికి నక్సలైట్లు , మతపరమైన విభజన శక్తులు , ఇతర సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోంటూ నేరాల అరికట్టడం , మాదక ద్రవ్యాల అణచివేయడానికి , మహిళ భద్రతకు , తమ ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. వీరి త్యాగాల వల్లనే ఈ రోజు దేశం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా నిజామాబాద్ కమిషనరేటు లో ప్రజల కోసం ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఈ నేల చెరగని ముద్ర వేసిందని అన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చూడాలని , ఎక్కడ ఎలాంటి సంఘటన చోటు చేసుకున్న , వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల భాగంగా పోలీసు కుటుంబాలను పరామర్శించినట్లు తెలిపారు. మన పోలీసులు ఒకటే కుటుంబం వారు వేసుకున్న యూనిఫాం అందరికీ గర్వకారణమని వారి త్యాగాల వల్ల నేడు మనం గర్వంగా బతుకుతున్నామని కొనియాడారు. ఈ దేశం కోసం న్యాయం కోసం , ఎప్పటికీ తలవంచకుండా పక్షపాతం లేకుండా , సేవా చేయడానికి మన హృదయలతో ప్రమాణం చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యాక్రమంలో సి.ఐలు, రిజర్వు ఇన్స్ పెక్టర్లు, ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు, ఆర్మూడ్ రిజర్వు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రహరీ గోడ లేదు.. చిన్నారుల భద్రత గాలిలో కలిసినట్టేనా?

- పేట్ బషీరాబాద్ సెయింట్ ఆన్స్ స్కూల్‌పై తల్లిదండ్రుల ఆగ్రహం

**మీ వార్త / కుత్బుల్లాపూర్ :**







వందలాది మంది చిన్నారులు చదువుకుంటున్న పాఠశాలలోనే భద్రత కరువైతే ఎలా? విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన విద్యార్థులు రక్షణ లేని వాతావరణంలో గడపాల్సిన పరిస్థితి నెలకొంటే బాధ్యత ఎవరిది? పేట్ బషీరాబాద్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్ పరిసరాల్లో ప్రహరీ గోడ లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అధికారులు ఆక్రమిత ప్రహరీ గోడను కూల్చివేసి నెలలు గడుస్తున్నా, పాఠశాల యాజమాన్యం ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు చేపట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

**ఏడాది ముందే నోటీసులు.. అయినా స్పందనేదీ?**

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీ గోడను తొలగించి, పాఠశాలకు సంబంధించిన సొంత స్థలంలోనే కొత్త గోడ నిర్మించుకోవాలని హైడ్రా అధికారులు ఏడాది క్రితమే యాజమాన్యానికి సూచించినట్లు సమాచారం. అయినప్పటికీ, అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేయకపోవడంతో అధికారులు ఆక్రమిత గోడను కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడ తాత్కాలికంగా పెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే, ఈ కంచె పాఠశాల విద్యార్థులకు పూర్తిస్థాయి భద్రత కల్పించలేకపోతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కుక్కలు, పందులు.. విష సర్పాలతో ప్రమాదం**

పాఠశాల చుట్టూ పటిష్టమైన ప్రహరీ లేకపోవడంతో వీధి కుక్కలు, పందులు ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. పరిసరాల్లో చెట్లు, పిచ్చిమొక్కలు ఉండటంతో విష సర్పాలు, తేళ్లు సంచరించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ఆటలాడుకునే సమయంలో లేదా తరగతి గదుల వద్దకు ఇవి చేరితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా, రాత్రి వేళల్లో పాఠశాల ప్రాంగణంలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించే అవకాశం ఉండటంతో భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు, ప్రాంగణానికి పటిష్టమైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

**ఫీజుల వసూళ్లపై శ్రద్ధ.. విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యమా?**

విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యం, వారి భద్రతకు అవసరమైన కనీస వసతులు కల్పించడంలోనూ అదే శ్రద్ధ చూపాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. హైడ్రా చర్యల అనంతరం సొంత స్థలంలో శాశ్వత ప్రహరీ గోడ నిర్మించడంతో పాటు, అప్పటివరకు బలమైన ఇనుప కంచె లేదా ఇతర తగిన రక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు.

పాఠశాల పరిసరాల్లో పిచ్చిమొక్కలను తొలగించి, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందన్న ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అధికారులు స్పందించకుంటే పాఠశాల ముట్టడి**

సెయింట్ ఆన్స్ స్కూల్‌లో భద్రతా ఏర్పాట్లపై విద్యాశాఖ, రెవెన్యూ అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల భద్రతకు ఎలాంటి ముప్పు లేకుండా యాజమాన్యం వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థి, తల్లిదండ్రుల సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలను ముట్టడించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# బీజేవైఎం మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా యెల్లు హేమంత్ రెడ్డి

- హేమంత్ రెడ్డిని సత్కరించి అభినందించిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

**రామంతపూర్, అక్టోబర్ 25 ( మన మీ వార్త):**





భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన యెల్లు హేమంత్ రెడ్డిని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా అభినందించారు. ఈ సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసిన హేమంత్ రెడ్డిని నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా హేమంత్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, సమాజ సేవలో నిరంతరం పాల్గొంటానని తెలిపారు. తనను అభినందించిన నాయకులకు, నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి శ్రీనివాస్, ధర్మ రాజినికర్ రెడ్డి, యెల్లు శశిధర్ రెడ్డి, కొడిచింతల ఉదయ్ కుమార్, కట్ట విఘ్నేష్ రెడ్డి, ఉకంటి జయప్రకాశ్ రెడ్డి, కావలి బాలాజీ, రవీష్, శ్రీకాంత్, ప్రేమ్, సీహెచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో వైభవంగా నాభిశిల (బొడ్డురాయి) పుష్కర 12వ వార్షికోత్సవ వేడుకలు

- వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,అక్టోబర్ 25 ( మన మీ వార్త):**

ఉప్పల్‌లో నాభిశిల (బొడ్డురాయి) పుష్కర 12వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని నాభిశిల (బొడ్డురాయి)కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు ప్రజల్లో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో మేకల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం

- కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్, అక్టోబర్ 25 ( మన మీ వార్త):**

ఉప్పల్ భగాయత్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. భగయత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ లేఅవుట్ పరిధిలోని గెలాక్సీ కాల్టన్ హిల్ అపార్ట్‌మెంట్స్, కాలభైరవ స్వామి టెంపుల్ రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నివాసితులకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొని, ప్రజాస్వామ్యంలో తమ భాగస్వామ్యాన్ని నిర్ధారించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భగాయత్ నివాసితులు, పట్టభద్రులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మీర్పేట్ హెచ్‌బీ కాలనీలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం హెల్ప్ డెస్క్‌లు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు

**మౌలాలి, అక్టోబర్ 25 ( మన మీ వార్త):**





గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు స్థానిక మాజీ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఈ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవసరమైన సమాచారం, నమోదు ప్రక్రియకు సంబంధించిన సహాయ సహకారాలను అందించేందుకు ఈ హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

## పరమేశ్వర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తుమ్మల రాజేందర్ రెడ్డి

**- ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేయించి జ్ఞాపిక అందజేసిన తుమ్మల రాజేందర్ రెడ్డి**



**ఉప్పల్, అక్టోబర్ 25 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, సాయిరామ్ కాలనీ అధ్యక్షుడు తుమ్మల రాజేందర్ రెడ్డి పరమేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం ఆయనకు జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పరమేశ్వర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు, పార్టీకి మరిన్ని సేవలు అందించాలని తుమ్మల రాజేందర్ రెడ్డి ఆకాంక్షించారు.

## కొంపల్లిలో భారీ చోరీ.. రూ.2 లక్షల నగదు, బోర్ మోటార్లు అపహరణ!

**- ఆధారాలు దొరకకుండా సీసీ కెమెరాలు, హార్డ్ డిస్కులు సైతం ఎత్తుకెళ్లిన దుండగులు**

**- పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**మీ వార్త / కుత్బుల్లాపూర్ :**




పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంపల్లిలో భారీ చోరీ ఘటన కలకలం రేపింది. శ్రీ సాయి దుర్గా పంప్స్ అండ్ బోర్వెల్ దుకాణాన్ని లక్ష్యంగా చేసుకున్న దుండగులు, షాపు పైకప్పు రేకులను తొలగించి లోపలికి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.2 లక్షల నగదుతో పాటు టెక్స్మో బోర్ మోటార్లను అపహరించారు.

అంతటితో ఆగకుండా, చోరీకి సంబంధించిన ఆధారాలు లభించకుండా ఉండేందుకు దుకాణంలోని సీసీ కెమెరాలు, హార్డ్ డిస్కులను సైతం ఎత్తుకెళ్లారు. దీంతో నిందితులను గుర్తించడం పోలీసులకు సవాలుగా మారింది. ఈ ఘటనపై దుకాణ యజమాని బండారి యాదగిరి పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన నిందితుల ఆచూకీ కోసం వివిధ కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

## 'మన్ కీ బాత్' సామాన్యుల విజయగాథలకు జాతీయ వేదిక

**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 25, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**



సామాన్యుల విజయగాథలకు జాతీయవేదికగా 'మన్ కీ బాత్' నిలుస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం దేశ ప్రధాని నరేంద్రమోదీ 'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్ ను ఆయన వీక్షించారు.

12 ఏళ్లుగా..ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు కృషి, సేవా స్ఫూర్తి, ఆవిష్కరణలు, దేశీయ ప్రతిభను దేశవ్యాప్తంగా పరిచయం చేయడం కార్యక్రమ ప్రత్యేకత అని తెలిపారు. 12ఏళ్లుగా నిరంతరాయంగా కొనసాగుతున్న మన్ కీ బాత్ ప్రజలకు, ప్రధానమంత్రికి మధ్య ఒక ఆత్మీయ వారధిగా నిలిచిందన్నారు. ఈ ఎపిసోడ్?లో పంజాబ్‌లోని మాల్వా ప్రాంతంలో సహజ పత్తి సాగును ప్రోత్సహిస్తున్న 'నవ్-త్రింజన్' కార్యక్రమాన్ని ప్రధాని ప్రశంసించడం విశేషమని పేర్కొన్నారు. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పునరుద్ధరించడంతో పాటు, చేనేత నైపుణ్యాలను భావితరాలకు అందించడం, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలు ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని వివరించారు.

## అక్టోబర్ 26న ఇందిరా పార్క్ వద్ద సిఐటియు మహా ధర్నా - సల్లా నర్సింహా యాదవ్

**బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్ 25 (మన మీ వార్త):**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ - 10 పరిధిలోని మేడిపల్లి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 26న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు (సి.ఐ.టి.యు) రాష్ట్ర కమిటీ ప్రకటించింది. అదేవిధంగా బోడుప్పల్ 12, 13వ డివిజన్ల భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు సల్లా నర్సింహ యాదవ్, మాట్లాడుతూ... "4 లేబర్ కార్డ్ లను రద్దు చేయాలి, సంక్షేమ బోర్డు నిధులు కార్మికులకే వినియోగించాలి, 60 ఏళ్లు పైబడిన కార్మికులకు నెలకు రూ.9,000 పెన్షన్, పిల్లలకు విద్య, వైద్యం, స్కాలర్ షిప్ లు. ఉచిత వైద్యం, (ఈ.ఎస్.ఐ) పీఎఫ్, సౌకర్యాలు, కల్పించాలని డిమాండ్" చేస్తున్నారు. గౌతమ్ నగర్, రాజీవ్ నగర్, దేవేందర్ నగర్ ఫేజ్-2 లో ప్రచారం నిర్వహించిన ఆయన, అక్టోబర్ 26న జరిగే ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

**- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

**నర్సంపేట, అక్టోబర్ 25 (మల్లేష్ మీవార్త ప్రతినిధి ):**




నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. ఆదివారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్, నర్సంపేట ఆర్డీవో ఉమారాణితో కలిసి కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు, నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్, బోర్‌వెల్ మోటార్ ఏర్పాటు చేయడంతోపాటు మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గతంలో మిషన్ భగీరథ ద్వారా కళాశాలకు నీటి సదుపాయం కల్పించినట్లు గుర్తుచేశారు.కళాశాల అభివృద్ధికి తన సహకారంతో 50 కంప్యూటర్లను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సహకరిస్తానని తెలిపారు. అదనపు తరగతి గదులు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల కల్పనకు జిల్లా యంత్రాంగం, కళాశాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**ప్రిన్సిపాల్‌కు అభినందనలు :**

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ విద్యా, పరిపాలనా రంగాల్లో చేస్తున్న కృషిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారం అందుకోవడం కళాశాలకు, నర్సంపేట ప్రాంతానికి గర్వకారణమని అన్నారు. కళాశాలలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, క్రమశిక్షణతో కూడిన వాతావరణాన్ని నెలకొల్పడం, విద్యార్థులను ప్రగతి దిశగా ప్రోత్సహించడంలో ప్రిన్సిపాల్ చేస్తున్న కృషిని ప్రశంసించారు.

గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని పునరుద్ఘాటించారు.

# రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లర్ల పై సిఐడి దాడులు

**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 25, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

**- నిజామాబాద్ లో సీఎంఆర్ ఎగవేసిన నలుగురు మిల్లర్లు అరెస్ట్ చేసిన సిఐడి**






నిజామాబాద్ జిల్లాలో తొలిసారి సిఐడి మిల్లర్ల పై దాడులు నిర్వహించింది. ఆదివారం తెల్లవారు జామున నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలలో మిల్లులు నిర్వహిస్తున్న నలుగురు మిల్లర్లను అరెస్ట్ చేశారు. ఇద్ధరు మిల్లర్లు పరారీ అయినట్లు సిఐడి డిఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సిఐడి డిఎస్పీ, ఇద్దరు సిఐలు, ఇద్ధరు ఎస్ఐల టీంకు తోడుగా లోకల్ పోలిసుల అండతో దాడులు జరిగాయి. నిజామాబాద్ జిల్లాలో కోట్ల రూపాయల సిఎంఆర్ ఎగవేత వేసిన వారిలో ప్రముఖ మిల్లర్లపై నజర్ వేసింది. అందులో భాగంగా పద్మవతి ఆగ్రో ఇండస్ట్రీస్ కు చెందిన లాబిశెట్టి గంగాప్రసాద్, వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమానీ పోట్ల అంజయ్య, శ్రీవాణి ట్రెడింగ్ ఆగ్రో ఇండస్ట్రీస్ అదినేత బోందుగుల దేవేందర్, మాస్టర్ బిహెచ్ యుడిఐ ఆగ్రో ఫుడ్స్ ఇండస్ట్రీస్ కు చెందిన లాబిశెట్టి శ్రీకాంత్ లను తెల్లవారు జామున వారి ఇండ్లలోనే అరెస్టు చేశారు. ముకుందా క్రిష్ణ ఆగ్రో ఇండస్ట్రీస్ కు చెందిన వనపర్తి సూర్యానారాయణ, అనుపమ ఆగ్రో ఇండస్ట్రీస్ కు చెందిన కిసా అనుషలు పరారీలో ఉన్నారని సిఐడి అధికారులు తెలిపారు. పరారీలో ఉన్నవారి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. మిల్లర్లను ఉదయం వెళ అరెస్టు చేయడం మిల్లర్లలో అలజడి చెలరెగింది. చాలమంది మిల్లర్లు అరెస్ట్ చేసింది ఎవ్వరో తెలియక లోకల్ పోలిస్ స్టేషన్ లకు పరుగులు తీశారు. కాని వచ్చింది సిఐడి అధికారులను తెలిసి తోకముడిచారు.

**ఉమ్మడి నిజామాబాద్ లో 2014 తరువాత రైస్ మిల్లర్లపై తొలిసారి సిఐడి**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తెలంగాణకు దాన్య గారంగా ప్రసిద్ది చెందింది. దాన్యం పండిచడంలో, సేకరణలో ఎప్పుడు రాష్ట్రంలో టాప్. అలాంటి జిల్లాలో మిల్లర్లు కస్టం మిల్లింగ్ రైస్ కోసం దాన్యంను సివిల్ సప్లై శాఖ నుంచి తీసుకోవడం మర అడించి ఎఫ్ సిఐకి సిఎంఆర్ ఇవ్వకుండా ఎగవేయడం పరిపాటిగా మారింది. గత ప్రభుత్వం నుంచి ఈ తరహ దందాకు ఉమ్మడి జిల్లా పెరుగాంచింది. దానికి తోడు మిల్లర్లు అధికార పార్టి నేతల కనుసన్నులలో ఉండటంతో కోట్ల రూపాయల ప్రభుత్వం ఇచ్చిన వడ్లను మర అడించకుండానే , బహిరంగ మార్కెట్ లో అమ్మివేసిన, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చెసిన పెద్దగా పట్టించుకోలేదు. సీఎంఆర్ ఎగవేతలో మాజీ ఎమ్మెల్యేతో పాటు పలువురు మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. కాని వారు న్యాయస్థానం ను అశ్రయించి ఉపశమనం పోందడం ప్రతీసీజన్ లో మళ్లి దాన్యం దక్కించుకోవడం రివాజుగా మారింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్పడిన ఆనంతరం సీఎంఆర్ ఎగవేత దారులకు అండగా అధికార పార్టి నేత ఉండటంతో డిపాల్డర్ లుగా గుర్తించి కేసులు, రెవిన్యూ రికవరి యాక్ట్ లకు పరిమితం కాగా తొలిసారి సిఐడి దాడులు జరుగడంతో మిల్లర్లు ఉలిక్కి పడ్డారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 350 పైగా రైస్ మిల్లులు ఉండగా దాదాపు రూ.750 కోట్ల దాన్యం మిల్లర్ల వద్ద పెరుకుపోయింది.గత ప్రభుత్వం హయంలో ప్రారంభమైన సీఎంఆర్ ఎగవేత యుదేచ్చగా సాగుతుంది. విజిలేన్స్ దాడులలో మిల్లుల్లో లోటు సీఎంఆర్ వెలుగు చూసిన అధికార పార్టి నేతల ఒత్తిడితో వారిపై ఉమ్మడి జిల్లాలో చర్యలు అధికారులు వెనుకంజ వేశారు. కామారెడ్డి జిల్లాలో కేసులు నమోదు, అరెస్ట్ లు జరిగిన, నిజామాబాద్ లో అఊసే లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అదేశాల మేరకు సివిల్ సప్లై అధికారుల పిర్యాదు తో కోట్ల రూపాయాల సిఎంఆర్ ఎగవేత దారులపై సిఐడి దాడులు చేసి అరెస్టు చేస్తుండటం మిల్లర్లకు మింగుడు పడటం లేదు.2014 లొ బోధన్ కేంద్రంగా వాణిజ్య పన్నుల శాఖలో వెలుగు చూసిన నకిలి చాలన్ ల 1200 కోట్ల కుంభకోణం జరిగినప్పుడు సిఐడి అందరితో పాటు మిల్లర్లను విచారించింది సిఐడి. దాదాపు పుష్కర కాలం తరువాత సీఎంఆర్ కుంభకోణంలో మిల్లర్లను అరెస్ట్ చేసి విచారిస్తుండటం విశేషం. అనాడు కేసుల నమోదుతో నకిలి చాలన్ లో ప్రమేయం ఉన్నవారు సంబంధిత సోమ్మును ఖజానకు చెల్లించి బయటపడ్డారు. ఈసారి కోట్ల రూపాయల సిఎంఆర్ ను మెక్కేసిన మిల్లర్లు సిఐడి విచారణ ను ఎలా ఎదుర్కుంటారో వెచి చూడాలి.

# 29 ఏళ్ల తర్వాత మురిసిన బాల్యం..
# ఘనంగా పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 25, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**



కాలం మారినా, దారులు వేరైనా స్నేహబంధానికి హద్దులుండవని పూర్వవిద్యార్థులు నిరూపించారు. నగరంలోని నిజామాబాద్ శ్రీ విద్యా పబ్లిక్ స్కూల్ 1996--97 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు 29ఏళ్ల తర్వాత ఒక్కచోట కలిశారు.మ్యాప్‌లు చూడండి

**అంతా ఒక్కటై అపూర్వ సమ్మేళనం..**

నగరంలోని గంగాస్థాన్ బైపాస్ సమీపంలో డాక్టర్స్ కాలనీ సుహాస్ని రాయల్ బంకెట్ హాల్ వేదికగా ఈ రీ యూనియన్ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తమ గురువులు స్కూల్ కరస్పాండెంట్ రవి, ఉపాధ్యాయులు మల్లికార్జున్, జగదీశ్వర్, సాయన్న, నాగరాజు, మృత్యుంజయ, నారాయణ, చంద్రకళ, రాజేశ్వర్, భూమేశ్వర్, అటెండర్ అశోక్ లను ఘనంగ సన్మానించారు. తమను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల ఆశీస్సులు పొందడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమతో పాటు చదువుకుని అకాల మరణం చెందిన సహచర మిత్రులు మాజీ కార్పొరేటర్ పంచరెడ్డి సురేష్, స్వప్న, సాయి కుమార్, వరలక్ష్మి , సుజాత జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

**పాత జ్ఞాపకాల మధురిమలు**

ఒకే బెంచీపై కూర్చున్న జ్ఞాపకాలు.. బెల్లు మోగగానే మైదానంలోకి పరుగులు తీసిన క్షణాలు.. ఆనాటి అల్లరి.. కష్టసుఖాలను నెమరువేసుకుంటూ పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. వాట్సాప్, సోషల్ మీడియా వేదికగా మళ్లీ ఒక్కటైన మిత్రులు, ముఖాలు మారినా మనసుల్లోని స్నేహబంధం మాత్రం చెరిగిపోలేదని చాటిచెప్పారు.

# ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో
# ఘనంగా మందముల పరమేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు**

**చిలుకానగర్, అక్టోబర్ 25 ( మన మీ వార్త):**







ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను చిలుకానగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ డివిజన్ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా 30 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి మందముల పరమేశ్వర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.అనంతరం హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు పరమేశ్వర్ రెడ్డికి ఆశీర్వచనాలు అందించి, ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## బాలాజీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో రేపు 2 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

- వినియోగదారులు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి

**జవహర్ నగర్, అక్టోబర్ 25 :(వార్త ప్రతినిధి) :**



జవహర్ నగర్ పరిధిలోని బాలాజీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం కలగనుంది. ఈ మేరకు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ-ఆపరేషన్) హెచ్. సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 33/11 కేవీ బాలాజీనగర్ సబ్ స్టేషన్ నుంచి బయలుదేరే 11 కేవీ లక్ష్మీనరసింహా ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత (ట్రీ ట్రిమ్మింగ్), లైన్ల నిర్వహణ (లైన్ మెయింటెనెన్స్) పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఈ నిర్వహణ పనుల కారణంగా సోమవారం, అక్టోబర్ 26వ తేదీ ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు (2 గంటల పాటు) సదరు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు (టోటల్ షట్ డౌన్) ఆయన వెల్లడించారు.

**విద్యుత్ అంతరాయం కలిగే ప్రాంతాలు:**

సిటిజన్ కాలనీ, బీరప్పగడ్డ, లక్ష్మీనరసింహా కాలనీ, వికలాంగుల కాలనీ, ఆదర్శ్ నగర్, రేణుకా నగర్, కెపిఐ కాలనీ, సుస్మితా నగర్, చెన్నాపురం, చిలుకల బిల్డింగ్, సాయిబాబా గుడి పరిసరాలు, చంద్రపురి కాలనీ, త్రీ టెంపుల్స్, శాంతి నగర్, ముత్యాలమ్మ గుడి ప్రాంతం మరియు పరిసర ప్రాంతాలు.

కావున ప్రజలు, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, నిర్వహణ పనులకు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మాజీ సర్పంచ్ ఈర్ల నితీష్ శ్రీకాంత్



**పటాన్‌చెరు, అక్టోబర్ 25 (మీ వార్త ప్రతినిధి):**

బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్‌గూడ సృజన లక్ష్మీనగర్ ఫేజ్-4 కాలనీలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పటేల్‌గూడ మాజీ సర్పంచ్ ఈర్ల నితీష్ శ్రీకాంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, గత ఎన్నో సంవత్సరాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు అనేక సమస్యలు తలెత్తేవని తెలిపారు. పటాన్‌చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్ ముదిరాజ్ ప్రత్యేక చొరవతో, పటేల్‌గూడ మాజీ సర్పంచ్ ఈర్ల నితీష్ శ్రీకాంత్ నిరంతర కృషి ఫలితంగా తమ కాలనీకి సీసీ రోడ్డు మంజూరు కావడం ఎంతో సంతోషకరమని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కాలనీవాసుల ఎన్నో ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజల రాకపోకలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. తమ కాలనీ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపించి, ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్, మాజీ సర్పంచ్ ఈర్ల నితీష్ శ్రీకాంత్‌లకు సృజన లక్ష్మీనగర్ ఫేజ్-4 కాలనీవాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## హనుమకొండ నేడు (సోమవారం) ప్రజావాణి కార్యక్రమం

- జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి అర్జీల స్వీకరణ

**మన మీ వార్త అక్టోబర్ 25 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

## హర్షితకు చల్లా అభినందనలు..



**అక్టోబర్ 26,10,2026 పరకాల ప్రతినిధి మన మీవార్త :**

హనంకొండ జిల్లా పరకాల నియోజకవర్గం దామెర మండల కేంద్రానికి చెందిన గుండా రజిత--శ్రీనివాస్ దంపతుల కుమార్తె హర్షిత మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించిన సందర్భంగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు.

ఈ సందర్భంగా హర్షిత వైద్య విద్యలో రాణించి, భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఆమె విజయం తల్లిదండ్రులతో పాటు గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ. 2 కోట్లతో నిర్మించిన గిరిజన బాలికల వసతి గృహం ప్రారంభం

- విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**నర్సంపేట, అక్టోబర్ 25(మల్లేష్ మీవార్త ప్రతినిధి ) :**

నర్సంపేట పట్టణంలో గిరిజన బాలికల సౌకర్యార్థం రూ. 2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన వసతి గృహాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ, నర్సంపేటలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా గదులు సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించి, విద్యార్థినులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో రూ. 2 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించినట్లు



వెల్లడించారు. ఈ వసతి గృహంలో సుమారు 300 మంది విద్యార్థినులు ఉండేందుకు వీలుగా సదుపాయాలు కల్పించగా, ప్రస్తుతం దాదాపు 260 మంది విద్యను అభ్యసిస్తూ వసతి పొందుతున్నారని పేర్కొన్నారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థినులకు వసతి పరమైన ఇబ్బందులు తగ్గి, చదువుపై మరింత ఏకాగ్రతతో దృష్టి సారించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కళాశాల విద్యలో బాలికలు రాణించాలంటే వసతి గృహాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ఎంతో ముఖ్యమని చెప్పారు.

**బాలికల విద్యాభివృద్ధికి వసతి గృహాలు కీలకం :**

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, విద్యార్థినులకు సౌకర్యవంతమైన వాతావరణంలో వసతి కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గిరిజన బాలికల విద్యాభివృద్ధిలో వసతి గృహాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థినులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటే వారు చదువుపై ఏకాగ్రత పెంచుకుని మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు. ఈ నేపథ్యంలో నూతన వసతి గృహం ప్రారంభం విద్యార్థినులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నారాయణ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ ఎ. ప్రవీణ, కొత్తగూడ డివిజన్ డిప్యూటీ ఈఈ ఎ. దేవిశ్రీ, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్, సాగునీరు, తాగునీటి అంశాలపై వాస్తవాలను వెల్లడించాలి

- బీఆర్ఎస్ మండల కమిటి డిమాండ్

**ఖానాపురం అక్టోబర్ 25 ( మల్లేష్ మీవార్త ప్రతినిధి) :**

విద్యుత్ సంక్షోభం, సాగునీటి నిర్వహణ, తాగునీటి లభ్యత, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన వివరాలు వెల్లడించాలని ఖానాపురం బీఆర్ఎస్ మండల కమిటి డిమాండ్ డిమాండ్ చేసింది. ఈసందర్భంగా ఖానాపురం మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేఖరుల హమావేశంలో బీఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహలక్ష్మి వెంకటనర్సయ్య ,బీఆర్ ఎస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ బత్తిని శ్రీనావాస్ గౌడ్ , మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు లు మాట్లాడుతూ

గత మూడేళ్లలో చేసిన అప్పులు, వాటి వినియోగంపై ప్రభుత్వం సమగ్ర వివరాలు వెల్లడించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో చేసిన అప్పులతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం చేసిన అప్పులు ఎక్కువగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. అప్పుల ద్వారా సమీకరించిన నిధులను ఏయే రంగాలకు ఖర్చు చేశారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

**విద్యుత్ సరఫరాపై స్పష్టత ఇవ్వాలి :**

రాష్ట్రంలో విద్యుత్ కొరతపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల పట్ల బీఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. విద్యుత్ కొనుగోలు ధరలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ నిల్వలు, భవిష్యత్తులో అవసరమయ్యే విద్యుత్ పరిమాణంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరింది. గృహ, పారిశ్రామిక రంగాలకు ఎంత విద్యుత్ అవసరం, రాష్ట్రంలో ఎంత విద్యుత్ అందుబాటులో



ఉంది, ఇంకా ఎంత విద్యుత్ కొనుగోలు చేయాల్సి వస్తుందనే అంశాలను లెక్కలతో సహా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేసింది.

**నీటి నిర్వహణలో ముందుచూపు అవసరం :**

ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులపై వాతావరణ నిపుణులు చేస్తున్న హెచ్చరికలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమైందని బీఆర్ఎస్ విమర్శించింది. కృష్ణా, గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం జరిగిందని ఆరోపించింది. కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థంగా వినియోగించుకుని ఉంటే కరువు ముప్పును కొంతవరకు ఎదుర్కొనే అవకాశం ఉండేదని పేర్కొంది.

రాబోయే పది నెలల్లో హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు అవసరమయ్యే తాగునీరు, గృహ అవసరాలు, సాగునీరు, పారిశ్రామిక అవసరాలపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించాలని సూచించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలు, నీటి పంపిణీ ప్రణాళికను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేసింది.

**కేసీఆర్‌పై విమర్శలు మానుకోవాలి :**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై విమర్శలు చేయడం కంటే ప్రస్తుత సమస్యలకు పరిష్కారాలు చూపడంపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను గత ప్రభుత్వంపై నెట్టివేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ప్రస్తుత సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని అన్నారు.

**నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలి :**

రాబోయే రోజుల్లో ఆహార ధాన్యాలు, నిత్యావసర సరుకుల కొరత ఏర్పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు నూనె, పప్పు ధాన్యాలను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరింది. ఆహార నిల్వలు, ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలపై అధికారులు సమీక్ష నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది.

విద్యుత్, నీటి నిల్వలు, సాగునీటి నిర్వహణ, ఆహార భద్రత, రాష్ట్ర అప్పులపై ప్రభుత్వం సమగ్ర వివరాలు వెల్లడించాలని ఖానాపూర్ బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రజల్లో ఆందోళన కలిగించే ప్రకటనలు చేయడం కంటే వాస్తవ పరిస్థితులను వివరించి, సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించాలని కోరుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనను తీవ్రంగా ఖండించింది. ఈకార్యక్రమంలో ఖానాపురం మండల బీఆర్ ఎస్ నాయకులు, ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్ ,ధర్మరావుపేట సర్పంచ్ మాద్రాజు వెంకన్న ,మనుబోతులగడ్డ సర్పంచ్ అబోతు శ్రీలతఅశోక్ , వివిధగ్రామాల సర్పంచ్ లు పాల్గొన్నారు.

# యాప్రాల్ రాజీవ్ గృహకల్ప కాలనీలో తాగునీటి సమస్య

**యాప్రాల్ , అక్టోబర్ 25 :(వార్త ప్రతినిధి)**

యాప్రాల్ డివిజన్ పరిధిలోని కౌకూర్ రాజీవ్ గృహకల్ప కాలనీలో తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ హౌసింగ్ బోర్డు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో జరిగిన ఈ పరిశీలనలో హౌసింగ్ బోర్డు డీఈ కాశీనాథ్, ఏఈ శ్రీహరి పాల్గొన్నారు.

**18 ఏళ్లుగా నిరుపయోగంగా ఓవర్ హెడ్ ట్యాంక్:**

2007లో కాలనీలో నిర్మించిన 2.5 కిలో లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నేటికీ వినియోగంలోకి రాకపోవడం గమనార్హం. లీకేజీల కారణంగా ట్యాంక్ పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరిందని, దీనివల్ల నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.



అంతేకాకుండా నాలుగు అంతస్తుల భవనాలపై ఉన్న నీటి ట్యాంకులు కూడా నిరుపయోగంగా ఉండటంతో నివాసితులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తుడిమెళ్ల మల్లికార్జున్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడంతో పాటు, పాడైపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ ను, భవనాలపై ట్యాంకులను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. సమస్యను



పరిశీలించిన అధికారులు సానుకూలంగా స్పందించి, త్వరితగతిన మరమ్మత్తు పనులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తుడిమెళ్ల మల్లికార్జున్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో యాప్రాల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాజ్, సయ్యద్ అస్లాం, ప్రవీణ్ రెడ్డి, రమేష్, శ్రీనివాస్, ప్రీతం, వాణి, లత, మంజుల, ధనలక్ష్మి తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

# వికలాంగుల కాలనీలో 15 రోజులుగా వృథాగా పోతున్న తాగునీరు - అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**జవహర్ నగర్, అక్టోబర్ 25: (వార్త ప్రతినిధి)**

కీసర సర్కిల్ పరిధిలోని వికలాంగుల కాలనీలో గత 15 రోజులుగా తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో విలువైన మంచినీరు వృథాగా రోడ్లపై పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళితే.. కాలనీలో ప్రధాన పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడి 15 రోజులు గడుస్తున్నా, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మరమ్మత్తులు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో రోజూ వేల లీటర్ల తాగునీరు వృథాగా పోతోందని, మరోవైపు తమ ఇళ్లకు సరైన ఒత్తిడితో నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

పైప్‌లైన్ కోసం తవ్విన గుంతల్లోనే నీరు నిలిచిపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విపరీతంగా పెరిగి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు తెలిపారు. ఒకవైపు ప్రభుత్వం నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తుంటే, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇలా నీరు వృథా కావడం దురదృష్టకరమని





భాషిపాక మహేందర్



కోదాటి కార్తీక్ రెడ్డి

అన్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీని తక్షణమే అరికట్టి, తాగునీటి వృథాను నివారించాలని స్థానికుడు కార్తీక్ రెడ్డి డిమాండ్ చేశారు.

## నీటిని పొదుపుగా వాడాలి.. ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి: మేయర్ కోలగాని శ్రీనివాస్

**కరీంనగర్** గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, భూగర్భ జలాల సంరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ అభివృద్ధి పనుల్లో భాగంగా 31వ డివిజన్‌లోని ఖాన్‌పూర్ రోడ్ నంబర్ 11, ప్రవిష్టా రోడ్డులో స్థానిక కార్పొరేటర్ సయ్యద్ ముఖద్దర్ హుస్సేన్ అలీతో కలిసి రూ.50 లక్షల యూఐడీఎఫ్ నిధులతో ఆర్‌సీసీ, ఎస్‌డబ్ల్యూజీ పైపులైన్ డ్రైనేజీ, సీసీ ప్యాచ్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని 66 డివిజన్లలో రూ.50 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా నగర అభివృద్ధికి రూ.840 కోట్ల నిధులు సమకూర్చామని, త్వరలో పలు ప్రాజెక్టుల పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే వినియోగించాలని, తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. రోడ్లపై పశువులను వదలకుండా సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో కోలాహలంగా మందముల పరమేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు





**– పది డివిజన్ల నుంచి భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు**

**– అర్ధరాత్రి నుంచే శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు తీరిన అభిమానులు**

**ఉప్పల్, అక్టోబర్ 25 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య అంబరాన్నంటాయి. నియోజకవర్గవ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు కోలాహలంగా, ఉత్సాహభరితంగా కొనసాగాయి. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆయన నివాసం వద్ద సందడి నెలకొంది.

**-అర్ధరాత్రి నుంచే శుభాకాంక్షల వెల్లువ**

మందముల పరమేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఉప్పల్ నియోజకవర్గంలోని పది డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం అర్ధరాత్రి నుంచే ఆయన నివాసానికి చేరుకున్నారు. పుష్పగుచ్చాలు అందజేస్తూ, శాలువాలతో ఘనంగా సత్కరిస్తూ జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనతో కలిసి కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**-కార్యకర్తలతో సందడిగా వేడుకలు**

నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో జన్మదిన వేడుకలు సందడిగా సాగాయి. అభిమానుల శుభాకాంక్షలు, నాయకుల అభినందనలతో ఆయన నివాసం వద్ద ఉదయం నుంచి ఉత్సాహభరిత వాతావరణం కనిపించింది. పార్టీ శ్రేణులు పరస్పరం శు భాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకల్లో పాల్గొన్నారు.

**-ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు**

తన జన్మదినం సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి, తనపై అభిమానంతో శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ మందముల పరమేశ్వర్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తన జన్మదినాన్ని ఇంతటి ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య జరిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి ఎమ్మెల్యే గండ్ర

**చిట్యాల అక్టోబర్ 25( మీవార్త)**

చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామంలో దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన సిసిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రధానోత్సవం కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, పట్టుదలతో పాటు జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్ .మాజీ జడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి. జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖిరాల మధు వంశీ కృష్ణ .ఘనపూర్ మాజీ పాక్స్ చైర్మన్ కుమార్ యాదవ్. బాల్ బ్యాట్మెంట్ జిల్లా అధ్యక్షులు గూట్ల తిరుపతి. సర్పంచ్ లు సిరిపెల్లి జంపయ్య. ఇంగిలి రాజేందర్ .సీనియర్ నాయకులు చిలుకల రాయకోమురు. మూల శంకర్. గౌడ్ నల్ల రాజి రెడ్డి. దూదిపాల బుచ్చిరెడ్డి. గుండెపురెడ్డి రవీందర్ రెడ్డి .తడుక కుమార్. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాభిమానులు, యువకులు తదితరులు పాల్గొన్నారు..


క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేస్తున్న ఎమ్మెల్యే

# రోడ్డు ప్రమాద బాధితులు పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**– వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్**

**మన మీ వార్త అక్టోబర్ 25 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన పీఎం రహత్ (ప్రీ =ూనారు --ౖాతీఅఎవ వీఱఅఱర్‌వతీ =శ్రీుఠ ూఽఎఱఅవత్ ఎఱఅష్‌ఱఎ'ం ఓశీంజూఱ్ఞశ్రీఱయ్‌ఱశీఅ ఖఅస ూాంంబతీవస ఎతీఱష్‌ఎవత్) పథకాన్ని అర్హులైన బాధితులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ సూచించారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో మొత్తం 63 ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ.1.5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు.



**ఈ సందర్భంగా ప్రజలకు సీపీ సూచనలు:**

- రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు కాల్ చేయాలి.
- క్షతగాత్రులను వీలైనంత త్వరగా సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆసుపత్రికి తరలించేలా సహకరించాలి.
- పథకం కింద వైద్య సేవలు పొందేందుకు ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించి, అవసరమైన వివరాలను అందించాలి.
- ప్రమాద బాధితులకు సహాయం చేయడంలో మానవతా దృక్పథంతో వ్యవహరించి, పోలీసులకు మరియు వైద్య సిబ్బందికి సహకరించాలి.

రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, ప్రజలు పీ.ఎం.రహత్ పథకంపై అవగాహన పెంపొందించుకుని అర్హులైన బాధితులకు ఈ పథకం ప్రయోజనాలు అందేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

# రోటరీ ఆధ్వర్యంలో పల్స్ పోలియో నిర్మూలన అవగాహన ర్యాలీ







**మన మీ వార్త అక్టోబర్ 25 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

**– "ఎండ్ పోలియో నౌ" హోర్డింగ్ ఆవిష్కరణ**

**వరంగల్ సిటీ, అక్టోబర్ 24:** రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో "ప్రపంచ పోలియో దినోత్సవం" సందర్భంగా "పోలియో నిర్మూలన" అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా "ఎండ్ పోలియో నౌ" అవగాహన హోర్డింగును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా అసిస్టెంట్ గవర్నర్ శారు ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రవిప్రకాష్, జిడబ్ల్యూఎంసి ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు అనంతుల కుమారస్వామి, కార్యదర్శి చందా రఘువీర్, కోశాధికారి చెరుకు రాజేందర్ రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ గంగిశెట్టి పూర్ణచందర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలియో నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించడంలో టీకాల ప్రాముఖ్యతను తెలియచేయడానికి క్లబ్ ఆధ్వర్యంలో "పోలియో నిర్మూలన" అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు అనంతుల కుమారస్వామి తెలిపారు. ఉదయం 7 గంటలకు వరంగల్‌లోని ఎస్.బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ చౌరస్తా మీదుగా హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు వెళ్లి తిరిగి ఎస్.బిఐ మెయిన్ బ్రాంచ్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో రోటేరియన్లు ఉత్సాహంగా పాల్గొని పోలియో రహిత ప్రపంచం కోసం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలన కోసం రోటరీ ఇంటర్నేషనల్ చేస్తున్న నిరంతర కృషిని ఈ సందర్భంగా చాటిచెప్పారు. ర్యాలీ అనంతరం ఎస్.బి.ఐ మెయిన్ బ్రాంచ్ పక్కనే ఉన్న ఆకారపు పెట్రోల్ పంప్ వద్ద "ఎండ్ పోలియో నౌ" అవగాహన హోర్డింగ్‌ను ఆవిష్కరించారు.

## వరంగల్ సిటీ ప్లానర్‌గా రవీంద్ర రెడేకర్ పోస్టింగ్.



**మన మీ వార్త అక్టోబర్ 25 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

గతంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహణ.
జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి.
పదోన్నతి అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా పోస్టింగ్.

## వరంగల్...తాళ్ల పద్మావతి కాలేజి దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం

**మన మీ వార్త అక్టోబర్ 25 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

లారీ టూ వీలర్ ఢీకొనిఉర్సు ప్రాంతానికి చెందిన ఆవునూరి రాజు అక్కడికక్కడే మృతి



## హైదరాబాద్. జర్నలిస్టులకు JNJHS నమస్కారం

**మన మీ వార్త అక్టోబర్ 25 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

తెలంగాణ రాష్ట్రంలో జీచీజీూ జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయం గురించి చెప్పాలని మా ప్రయత్నం.
1000 మంది పైగా జర్నలిస్టులం 2008 లో కలిసి జవహర్లాల్ నెహ్రూ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ (జీచీజీూ) ని ఏర్పాటు చేసుకున్నాం.
ా =ఖయిుంష్ట్రవఎవతీ =వసఎఎ ముఖ్యమంత్రిగా ఉండగా 70 ఎకరాల భూమి (నిజాంపేట్ లో 32 ఎకరాలు, పేట్ బషీరాబాద్ లో..కొంపల్లిలో 38 ఎకరాలు) కేటాయించారు. ప్రభుత్వం నిర్ణయించిన అప్పటి మార్కెట్ ధరకు అనుగుణంగా మా సొసైటీ 12 కోట్ల 33 లక్షల రూపాయలు ప్రభుత్వానికి 2011 లో చెల్లించాం. ఒక్కొక్కరం 2 లక్షలు ఇందుకోసం ఇచ్చాము. డబ్బు లేకపోవడం తో భార్య మెడలో పుస్తెల తాడు అమ్మి వేశాం. అప్పట్లో ఇక్కడ భూమి ధర తక్కువగా ఉన్నప్పటికీ. మేము ఎక్కువ చెల్లించాము. ఈ డబ్బు పెడితే రామోజీ ఫిలిం సిటీ వద్ద లేదా మరో చోట 400 గజాల స్థలం వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వం చెబుతున్న ఫ్యూచర్ సిటీ లో ఒక్కో సభ్యుడికి 2 ఎకరాల భూమి వచ్చేది.
×ూూ/ శ్రూూ, మీూూ/ఫ్రూ ల సొసైటీలకు కూడా ఇళ్ల స్థలాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో జీచీజీూ తరహాలోనే భూములను కేటాయించారు.
హై కోర్టులో , సుప్రీం కోర్టులోౖాూ దాఖలు అయ్యాయి. 70 ఎకరాలు మా సొసైటీకి స్వాధీనం చెయ్యాలని సుప్రీం కోర్టు 2017, 2022 లలో ఆదేశాలు జారీ చేసింది.
నిజాంపేట్ లో 32 ఎకరాలని ఖజ= ప్రభుత్వం ఇచ్చింది. కొంపల్లి భూమి ఇవ్వలేదు.
2024 సెప్టెంబర్ 8 న కొంపల్లి భూమి ఇస్తామని ఒక మెమో ను రేవంత్ రెడ్డి ఇచ్చారు. కాగితం ఇచ్చారు కానీ భూమి స్వాధీనం చేయలేదు. 2024 లో సుప్రీం కోర్టు తీర్పు చెబుతూ, తక్కువ ధరకు భూమి కేటాయించారని సంబంధిత +ూ లను కొట్టి వేశారు. మార్కెట్ ధర ప్రకారం కేటాయించవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది.
18 ఏళ్ల క్రితమే మేము కట్టిన డబ్బు తక్కువ అని భావిస్తే, సుప్రీం కోర్టు చెప్పినట్టు ఎక్కువ ధర మరో 10 లేదా 20 కోట్లు చెల్లిస్తామని మా సొసైటీ తరపున ప్రభుత్వానికి చెప్పాము.
మాకు కేటాయించిన 70 ఎకరాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఎక్కువ డబ్బు చెల్లిస్తామని మేము ముందుకు వచ్చినా ప్రభుత్వం అంగీకరించడం లేదు.
మా సొసైటీ సభ్యుల్లో ఇప్పటికే 90 మంది ఇంటి స్థలం చూసుకోకుండా మరణించారు. చాలా మంది రిటైర్మెంట్ అయ్యారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం లేకపోవడం తో దుర్భర జీవితం గడుపుతున్నారు
ఈ నేపథ్యం లో 2026 నవంబర్ 3 న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నా చెయ్యాలని నిర్ణయించాం. జర్నలిస్టులు, అన్ని వర్గాల ప్రజలు మాకుసహకరించాలని కోరుతున్నాం

పి వి రమణా రావు
98499 98093
కె. అశోక్ రెడ్డి
96033 22489
డైరెక్టర్స్,

## చిన్నారిని ఆశీర్వదించిన కీర్తి రెడ్డి



**చిట్యాల అక్టోబర్ 25 మీ వార్త**

టేకుమట్ల మండలానికి చెందిన ఉమాదేవి ప్రవీణ్ దంపతుల కుమార్తె ప్రశాంతి సారీ ఫంక్షన్ పి ఆర్ ఎం ఆర్ హాల్‌లో జరగగా ఈ కార్యక్రమానికి ఆదివారం రోజున బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించి చిరుకానుక అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గాజుల అజయ్, బండారి సమ్మయ్య, సుబ్బక్కపల్లి సర్పంచ్ బొడ్డు రాజేందర్, బీజేవైఎం జిల్లా నాయకుడు పంజాల కుమార్ గౌడ్, జిల్లా నాయకులు కూర సురేందర్ రెడ్డి, బట్టల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల కోటు నమోదు కార్యక్రమం

**అక్టోబర్, 26,10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త**





నల్లగొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా తానూ మరియు తమ కుటుంబ సభ్యుల గ్రాడ్యుయేట్స్ ఓట్లు నమోదు చేసుకున్న పత్రాలను స్థానిక బి ఎల్ ఓఎంక్వయిరీ చేస్తున్న క్రమంలో అప్లై చేసుకున్న పత్రాలను చూపిస్తున్న టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్- చైర్మన్ డాక్టర్. మడికొండ శ్రీను. ఈ సందర్భంగా డాక్టర్. మడికొండ శ్రీను మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మద్దతుగా గ్రాడ్యుయేట్స్ అందరూ తమ ఓటు నమోదు చేసుకోవాలని, స్థానిక శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో శ్రీ. రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారిని బలపరచాలని పిలుపునిచ్చారు.

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటా..
## - మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**అక్టోబర్ 26,10 ,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పోగుల సంజీవ సోదరుడు కుమార్ అకాల మరణం చెందగా, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అదేవిధంగా ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గట్టికొప్పుల పెంటయ్య మృతిచెందగా ఆయన పార్థివదేహాన్ని సందర్శించి చల్లా ధర్మారెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, అకాల మరణం చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు.

ఎాఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కసుల బారిన పడకుండా, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యల పరిష్కారం సులువు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహతి వైష్ణవి.

**జయశంకర్ భూపాలపల్లి.** వ్యక్తిగత రాగద్వేషాలు కలిగి ఉండడం, ప్రతీకార చర్యలకు పూనుకోవడం, కేసుల బారిన పడటం వ్యర్థమని, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడం ఉత్తమమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి తాడూరు మహతి వైష్ణవి తెలిపారు. ట్రైనింగ్ పొందిన మీడియేటర్స్, కమ్యూనిటీ మీడియేటర్స్ మరియు పారా లీగల్ వాలంటీర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. జడ్జీ మాట్లాడుతూ కేసుల్లో చిక్కి ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలని, మధ్యవర్తిత్వం ద్వారా కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం మంచిదనే విషయాన్ని అందరికి అవగాహనా కల్పించాలని సూచించారు. చిన్న పిల్లల సురక్షిత బాల్యం కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న అవేర్నెస్ కార్యక్రమాల్లో అందరు భాగస్వాములు కావాలని, నేటి బాలలే రేపటి పౌరులు అని, వారిని పరిరక్షించడం మన బాధ్యత అని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ పొందిన మీడియేటర్స్ పీ.ఆనంద రావు, కనపర్తి కవిత, ఎస్.రవీందర్, మంగళపల్లి రాజ్ కుమార్, ఇందరపు శివకుమార్, ఎల్.విష్ణు, ఏ.రవికుమార్, అంబాలా ఆనందం, రాజమౌళి, రాజ్ కిరణ్, పారా లీగల్ వాలంటీర్లు శ్రీనివాస్, రజని, సందీప్ రాజ్, కిరణ్, అంజయ్య, లక్ష్మి నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ విస్తీర్ణం పెంపుదల, కలప, జంతువుల స్మగ్లింగ్ అరికట్టడమే ధ్యేయం

**మెదక్** శనివారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ , జిల్లా అటవీ సంరక్షణ కమిటీ చైర్మన్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి , పోలీస్ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో అడవుల సంరక్షణకు ,పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా కఠినమైన నిఘా ఏర్పాటు చేయాలని, సరిహద్దులను జియో-ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షించాలని నిర్ణయించారు.పోడు భూముల సమస్యలు, అక్రమ కలప రవాణా వన్యప్రాణుల వేటను అరికట్టడానికి అటవీ , పోలీస్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు.అటవీ సరిహద్దు గ్రామాల్లోని ప్రజలకు, యువతకు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, అటవీ సంరక్షణలో వారిని భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా అటవీ శాఖ అధికారి జో జి మాట్లాడుతూ..అటవీ చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అడవుల రక్షణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్,జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ ,డిఎస్పీ ప్రసన్న కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

## తుమ్మ చెట్లు.. పిచ్చి మొక్కలతో నిండిన శ్మశానవాటిక ప్రాంగణం

**భద్రాద్రి కొత్తగూడెం** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్మశానవాటిక పరిస్థితి అధ్వానంగా మారిందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. శ్మశానవాటిక ప్రాంగణంలో తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది.

# కాశీ విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు







- మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ నివాసంలో ప్రజాప్రతినిధుల ఆత్మీయ విందు
- ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యేలు మహిపాల్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి.
- ఘనంగా సన్మానించిన మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్

**పటాన్‌చెరు, అక్టోబర్ 25 మీ వార్త ప్రతినిధి :**

అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు కార్యక్రమానికి పలువురు ముఖ్య ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. "నరసింహ గౌడ్ నివాసానికి రావాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. వివిధ కార్యక్రమాల వల్ల రావడం కుదరలేదు. ఈరోజు సమయం కుదరడంతో ఇక్కడికి వచ్చి అందరితో కలిసి మధ్యాహ్న భోజనం చేయడం ఎంతో సంతోషాన్నిచ్చింది" అని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ ముఖ్య అతిథులకు సాదర స్వాగతం పలికి, శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం వారితో కలిసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. స్థానిక అభివృద్ధి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై నేతల మధ్య కొద్దిసేపు చర్చ జరిగింది.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, ఐలాపూర్ మాణిక్ యాదవ్, పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్రగుప్తుడి లెక్కలోకి రాని ఖాళీ పేజీ

ఒక పట్టణంలో నిష్కల గుప్తుడు అనే వర్తకుడు ఉండేవాడు. అతనికి దైవమంటే నిష్కలమైన భక్తి. రోజూ తెల్లవారుజామునే లేచి సమీపంలోని శివాలయానికి వెళ్ళేవాడు. ఎలాంటి ఆర్భాటమూ, ప్రదర్శనా బుద్ధి లేకుండా ప్రశాంతమైన మనస్సుతో గోక్షీరంతో, పవిత్ర జలంతో పరమశివునికి అభిషేకం చేసేవాడు. దేవునికి సుగంధ పుష్పాలు ఉంచి, ప్రసాదం సమర్పించి, "ఈ దేహమూ నీదే, ఈ పూజ చేసే శక్తి నీదే" అనే నిష్కల సమర్పణా భావనతో సమర్పించుకునేవాడు.

ఆలయం నుంచి నేరుగా తన వ్యాపార స్థలానికి చేరుకుని వర్తకం ప్రారంభించేవాడు. అతడు ధర్మబద్ధంగా వివిధ నాణ్యతలు కలిగిన సరుకులను విక్రయించేవాడు. అత్యుత్తమ నాణ్యత గల సరుకుల నుంచి, స్వల్ప నాణ్యత కలిగిన సాధారణ రకాల వరకు అన్నీ అతడి వద్ద లభించేవి. నిష్కల గుప్తుడు ఎప్పుడూ తక్కువ నాణ్యత ఉన్న సరుకును మంచి నాణ్యత ఉన్నదని చెప్పి మోసం చేసేవాడు కాదు. ఏ సరుకు ఎలాంటిదో స్పష్టంగా చెప్పి, దానికి తగిన సమంజసమైన ధరకే అమ్మేవాడు.

అయినప్పటికీ, కొందరు వినియోగదారులు సరుకుల నాణ్యత తమ నిరీక్షణకు తగ్గట్టు లేదని గ్రహించినప్పుడు ఆ వ్యాపారిని నిందించేవారు, శపించేవారు. నిష్కల గుప్తుడు ఆ మాటలకు ఎంతమాత్రం కోపగించుకోకుండా లేదా కుమిలిపోకుండా, "సమాజంలో రకరకాల అవసరాలు, రకరకాల అభిప్రాయాలు ఉంటాయి. నేను కేవలం సరుకులను చేరవేసే ఒక నిమిత్తమాత్రుడను" అని భావిస్తూ తన పని తాను చేసుకుపోయేవాడు.

ఇలా కొన్నేళ్లు గడిచాక, ఒక రోజు ఉదయం వయోభారం వల్ల అతడు హఠాత్తుగా కన్నుమూశాడు.

అతని అంత్యక్రియలకు ఊరి జనం గుమిగూడారు. "రోజూ నియమంగా శివాభిషేకం చేసే ఉత్తముడు" అని కొందరు అతడి దైవచింతనను స్మరించుకుంటే, "వ్యాపారంలో అన్ని రకాల సరుకులూ అమ్మి చాకచక్యంగా లాభాలు గడించిన గడుగ్గాయి" అని మరికొందరు అతడి వర్తక విధానాలను చర్చించుకున్నారు. లోకం దృష్టిలో అతడు పుణ్యమూ, పాపమూ రెండూ మూటగట్టుకున్న సగటు మనిషి.

దేహాన్ని వీడిన నిష్కల గుప్తుని జీవాత్మ యమలోకానికి చేరుకుంది. అక్కడ యమధర్మరాజు తన గంభీరమైన సింహాసనంపై కూర్చుని ఉన్నాడు. ఆయన పక్కనే ప్రాణుల పాపపుణ్యాల లెక్కలు రాసే చిత్రగుప్తుడు ఉన్నాడు.

యమధర్మరాజు సైగ చేయగానే, చిత్రగుప్తుడు ఆ మనిషికి సంబంధించిన 'అగ్రసంధాని' అనే విశ్వలేఖ పుస్తకాన్ని తెరిచాడు.

ఆ పుస్తకం పేజీలు తిరగేసిన చిత్రగుప్తునికి పెద్ద ఆశ్చర్యం కలిగింది! సాధారణంగా ప్రతి మనిషి పేజీలో చేసిన పుణ్యాలు స్వర్ణాక్షరాలతో, పాపాలు నల్లటి చారలతో స్పష్టంగా రాసి ఉంటాయి. కానీ నిష్కల గుప్తుని పేజీ మాత్రం పూర్తిగా ఖాళీగా ఉంది! ఒక్క పుణ్యమూ లేదు, ఒక్క పాపమూ లేదు.

చిత్రగుప్తుడు ఆశ్చర్యంతో యమధర్మరాజుతో ఇలా అన్నాడు - "ప్రభూ! ఏదో పెద్ద తప్పు జరిగింది. ఈ మనిషి భూలోకంలో సుదీర్ఘకాలం జీవించాడు. రోజూ శివునికి అభిషేకం చేశాడు, దానాలు చేశాడు. అలాగే వ్యాపారంలో జనాల తిట్లు, శాపాలు కూడా తిన్నాడు. కానీ ఇతని అగ్రసంధాని పత్రంలో ఒక్క పాపం గానీ, పుణ్యం గానీ రాసి లేదు. అంతా ఖాళీగా ఉంది. నా రాతలో ఏమైనా దోషం ఉందా?" అని కంగారు పడుతుండగా...

చిత్రగుప్తుడి మాటలు విన్న యమధర్మరాజు తన దివ్యదృష్టితో నిష్కల గుప్తుని జీవితాన్ని మొత్తం వీక్షించాడు. ఆ జీవి అంతరంగం ఎలాంటిదో ధర్మరాజుకు క్షణంలో అర్థమైంది.

వెంటనే యమధర్మరాజు చిరునవ్వు నవ్వి, తన గంభీరమైన సింహాసనంపై నుంచి ఆ జీవాత్మ వైపు కరుణగా చూశాడు. ఆ జీవాత్మను నరక బాధలకు గానీ, స్వర్గ సుఖాలకు గానీ పంపకుండా నేరుగా 'మోక్ష ద్వారం' వైపు తీసుకెళ్లమని యమదూతలకు ఆదేశించాడు.

ఇది చూసి చిత్రగుప్తుడు, "ప్రభూ! అగ్రసంధానిలో పుణ్యమూ లేదు, పాపమూ లేదు. కనీసం స్వర్గ సుఖాలు అనుభవించడానికో, నరకయాతనలు పడడానికో తగిన లెక్కలేని ఈ జీవికి నేరుగా మోక్ష ద్వారాన్ని చూపించడం యమధర్మ చట్టాలకు ఎలా సమ్మతమవుతుంది?" అని జిజ్ఞాసతో అడిగాడు...

అప్పుడు యమధర్మరాజు తన గంభీరమైన స్వరంతో చిత్రగుప్తుడికి ఇలా వివరించాడు:

"చిత్రగుప్తా! మన అగ్రసంధాని అనేది కేవలం కర్మలను నమోదు చేసే పుస్తకం కాదు; అది మానవుడి 'అహంకారాన్ని' నమోదు చేసే దర్పణం! కర్మ పాపమైనా, పుణ్యమైనా... 'నేను చేస్తున్నాను' అనే అహంకారం ఉన్నప్పుడే అది కర్మఫలంగా మా ఖాతాలో చేరుతుంది. కానీ ఈ మనిషి తన పేరు 'నిష్కల గుప్తుడు' అని ఉన్నట్టే, జీవితమంతా నిష్కలమైన మనస్సుతో, 'కర్తృత్వ భావనా రాహిత్యం'తో బతికాడు.

చూడు... ఇతడు ఉదయాన్నే శివునికి అభిషేకం చేసినప్పుడు 'నేను గొప్ప పుణ్యం చేశాను' అని పొంగిపోలేదు.

అలాగే వ్యాపారం చేసేటప్పుడు కూడా లాభాల దురాశతో గానీ, ఎవరినైనా మోసం చేయాలనే దుర్బుద్ధితో గానీ వ్యాపారం చేయలేదు. స్పష్టమైన నాణ్యతతో, న్యాయమైన ధరకే సరుకులను సమాజానికి అందించే ఒక 'మధ్యమంగా' మాత్రమే తన స్వధర్మాన్ని నిర్వర్తించాడు.

"చిత్రగుప్తా! నిష్కల గుప్తుడు అనుక్షణం తానొక నిమిత్తమాత్రుడననే సత్యాన్ని గ్రహించి ప్రవర్తించాడు. అతడికి 'నేను పుణ్యాత్ముడను' అనే అహంకారమూ లేదు, 'నేను పాపిని' అనే సంకోచమూ లేదు. తాను చేసిన ప్రతి పని ఫలాన్ని తక్షణం సమాజానికి, ప్రకృతికి, దైవానికి ధారపోశాడు.

ఎక్కడైతే అహంకారం శూన్యమవుతుందో, అక్కడ కర్మబంధం తెగిపోతుంది. అగ్రసంధానిలో పేజీ ఖాళీగా ఉందంటే అది మన వ్యవస్థలోని లోపం కాదు... అతడు 'కర్మసన్యాస యోగాన్ని' పరిపూర్ణంగా ఆచరించాడని దానికి అర్థం. యమధర్మ చట్టాలలో ఎలాంటి తప్పు లేదు; అహంకార రహితుడైన జీవికి యమలోకంతో పనిలేదు, అతడు మోక్షానికి మాత్రమే అర్హుడు!"

చిత్రగుప్తుడు సంతోషంతో నమస్కరిస్తూ అగ్రసంధానిని మూసివేశాడు. నిష్కల గుప్తుని జీవాత్మ ప్రశాంతంగా మోక్ష ద్వారం గుండా అనంత చైతన్యంలో విలీనమైపోయింది.

"చిత్రగుప్తుడు లెక్కించలేని పాపపుణ్యాలు" అనే ఈ కథ మనకు అందించే పరమసత్యం ఒక్కటే: మోక్షం అనేది పాపాలను తగ్గించుకుని, పుణ్యాలను పోగుచేసుకోవడం వల్ల మాత్రమే లభించేది కాదు; 'నేను చేస్తున్నాను' అనే అహంకారాన్ని పూర్తిగా కరిగించుకోవడం వల్ల సిద్ధించేది.

కొలనుపాక కుమారస్వామి 99637 20669, వరంగల్.

# మహా రుద్రాభిషేకంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి



**పటాన్ చేరు అక్టోబర్ 25 మీ వార్త ప్రతినిధి :**

- 130 మంది వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు
- 5 లక్షల పుష్పాలతో కన్నులపండువగా పుష్పార్చన



పటాన్‌చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని జయలక్ష్మి నగర్ ఫేజ్-2లో గల శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం ఆదివారం శివనామస్మరణతో మార్మోగింది. మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం, పుష్పార్చన కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో మాజీ మంత్రి, శాసనసభ ఉపనేత తన్నీరు హరీశ్ రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 130 మంది వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించిన మహా రుద్రాభిషేకం భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచెత్తింది. 5 లక్షల పుష్పాలతో చేపట్టిన పుష్పార్చన కన్నులపండువగా సాగింది. హరహర మహాదేవ శంభోశంకర నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ముందుగా బీరంగూడకు చేరుకున్న హరీశ్ రావుకు బీరంగూడ కమాన్ వద్ద భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి చేరుకున్న హరీశ్ రావుతో పాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మహా రుద్రాభిషేకం, పుష్పార్చన కార్యక్రమాల్లో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు



అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్ రావు అమీన్‌పూర్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన విందుకు హాజరయ్యారు.

# ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తీవ్ర నీటి సంక్షోభం!

- నీటిని పొదుపు చేయడమే కాదు.. ప్రతి ఒక్కరూ చెట్టును నాటండి.
- భవిష్యత్ తరాల మనుగడ కోసం ఇప్పటి నుంచే మేల్కొనాలి
- గందె వెంకటేశ్వర్లు.

అక్టోబర్26,10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త

హనంకొండ జిల్లా పరకాల: వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, భూగర్భ జలాల విచ్చలవిడిగా వినియోగం వంటి పరిణామాలు భవిష్యత్తులో మానవ మనుగడకు సవాలుగా మారే ప్రమాదం ఉందని పరకాల శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్, పరకాల ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సీడ్స్ అసోసియేషన్ వెల్ఫేర్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిస్థితులు ఏర్పడితే నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**తాగునీటి కోసం అల్లాడే పరిస్థితులు రాకుండా ఇప్పుడే చర్యలు తీసుకోవాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని వృథా చేయవద్దంటూ ప్రభుత్వం, అధికారులు చేస్తున్న ప్రచారం అభినందనీయమని గందె వెంకటేశ్వర్లు అన్నారు. అయితే ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించడంతోపాటు, భవిష్యత్తులో నీటి లభ్యత పెరిగేలా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు.

రానున్న తరాలకు తాగునీరు అందుబాటులో ఉండాలంటే ఇప్పటి నుంచే వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, చెట్ల పెంపకం వంటి చర్యలను ప్రజా ఉద్యమంగా మార్చాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**నీటిని పొదుపు చేయడం ఒక బాధ్యత.. చెట్లను పెంచడం మరో మహత్తర బాధ్యత**

"ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని చెబుతున్నాం. మరి భవిష్యత్తులో నీటి లభ్యత పెరిగేలా ఏం చేస్తున్నాం? అన్నాన్ని పొదుపుగా తినడం ఎంత ముఖ్యమో, రేపటి కోసం పంటను పండించడం కూడా అంతే ముఖ్యం. అలాగే నీటిని కాపాడుకోవడం ఎంత అవసరమో, ప్రకృతిని సంరక్షించడం కూడా అంతే అవసరం" అని ఆయన అభిప్రాయపడ్డారు.

చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, కార్బన్ డైఆక్సైడ్‌ను గ్రహించడంలో, నేల కోతను తగ్గించడంలో, నీరు నేలలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితులు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. అయితే చెట్లు నాటడం ఒక్కటే వర్షాలకు హామీ కాదని, నీటి సంరక్షణతో పాటు సమగ్ర పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రతి ఇంటికి ఒక చెట్టు.. ప్రతి పాఠశాలకు పచ్చని బాధ్యత**

ప్రతి ఇంటి ఆవరణలో, ప్రతి పాఠశాలలో, అవకాశం ఉన్న ప్రతి కొత్త భవన ప్రాంగణంలో కనీసం ఒకటి లేదా రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే విధానాన్ని ప్రోత్సహించాలని గందె వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మొక్కలు నాటిన తర్వాత వాటిని పట్టించుకోకుండా వదిలేయడం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని, కనీసం మూడేళ్లపాటు మొక్కలు బతికేలా సంరక్షణ బాధ్యతను నిర్ధారించే విధానం అవసరమని పేర్కొన్నారు. స్థానిక పరిస్థితులకు అనువైన, తక్కువ నీటితో పెరిగే చెట్లను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

**హరిత కార్యక్రమాలు ఫొటోలకే పరిమితం కాకూడదు**

ప్రభుత్వం చేపట్టే హరితహారం వంటి కార్యక్రమాల్లో నాటిన మొక్కల సంఖ్యతోపాటు, అవి ఎంతవరకు బతికి పెరిగాయనే అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. గ్రామాలు, పట్టణాల వారీగా మొక్కల సంరక్షణను పర్యవేక్షించి, ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు.

అదేవిధంగా ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి వృథాను అరికట్టడం, చెరువులు మరియు ఇతర జలవనరులను పరిరక్షించడం వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**నేటి బాధ్యతే రేపటి తరాలకు రక్షణ**

"నీటిని పొదుపు చేయడం అంటే ఈ రోజును కాపాడుకోవడం. చెట్టును నాటి పెంచడం అంటే భవిష్యత్తు తరాల కోసం పచ్చని భవిష్యత్తుకు పునాది వేయడం. మనం ఈ రోజు ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే, దాని ప్రభావాన్ని మన పిల్లలు, మనవళ్లు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే ప్రభుత్వాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమిష్టిగా ముందుకు రావాలి" అని గందె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు లేదా అందుబాటులో ఉన్న ప్రదేశంలో ఒక మొక్కను నాటి, దానిని చెట్టుగా ఎదిగే వరకు బాధ్యతగా సంరక్షించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నీరు, నేల, చెట్టు, ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని, భవిష్యత్తు తరాలకు జీవనాధారాలను అందించడం నేటి సమాజం ముందున్న ముఖ్య కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు.

# పదవుల కోసం... వెయిటింగ్.. ఇంకెన్నాళ్లు?

**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారం లో ఉంది. గడచిన మూడు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తుంది. కానీ ఇప్పటికి ఆ పార్టీలో జాప్యం.. నిర్లక్ష్యం.. కొనసాగుతూనే ఉన్నాయి.. అసలు ఈ పరిస్థితికి కారణమెవ్వరు.. ఇలానే కొనసాగితే వచ్చే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రాగలుగు తుందా.. అసలు ఇంతటి జాప్యం ఎందుకు జరుగుతోంది.. ఇవే ప్రశ్నలు ఇప్పుడు ఆ పార్టీ క్యాడర్లో వినిపిస్తున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్.. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు.. కేడర్ కోసం కల్పించాల్సిన అవకాశాల మీద భేటీ నిర్వహించారు. ఎప్పటి మాదిరిగానే భారీ జెండాను తెర ముందుకు తీసుకొచ్చారు. పార్టీ కమిటీ లో నియామకాలను పూర్తి చేయాలని నిర్ణయిం చారు. నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్పొరేషన్ చైర్మన్ ల పదవులకు గడువులు ముగియడంతో.. రెన్యువల్ చేయాలని అనుకున్నారు.. ఖాళీ అయ్యే గవర్నర్ కోట ఎమ్మెల్సీలను భర్తీ చేయాలని భావిం చారు.. సీఎం చాలా విస్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం తో.. ఇవన్నీ కూడా అమలు అవుతాయని అందరూ అనుకు న్నారు. కానీ, ఇవి చర్చలకే పరిమితమవుతాయని.. ఏదో అప్పటికప్పుడు సమావేశాలలో నిర్ణయాలు తీసుకుంటారని.. త్వరలోనే భర్తీ చేస్తామని ప్రకటిస్తారని.. ఆ తర్వాత అడుగు కూడా ముందుకు వేయాలని కార్యకర్తలు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారులకు వచ్చి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ పదవుల భర్తీ వ్యవహారం ఇప్పటికీ పూర్తికాలేదు. ఇది ఎప్పటికీ పూర్తికాని ఒక సమస్య లాగా మిగిలిపోయింది. నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం అనేకసార్లు కమిటీలను నిర్ణయించారు అనేక పర్యాయా లు అంతర్గత చర్చ జరిపారు. అధిష్టానం వద్దకు జాబితాలు పంపించారు. అవన్నీ కూడా పంపించినంత వేగంతో వెనక్కి వచ్చేశాయి. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు చాలామంది కార్య కర్తలు కేసులు ఎదుర్కొన్నారు. డబ్బులు ఖర్చు పెట్టుకున్నారు. పోలీస్ దెబ్బలు కూడా తిన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు న్యాయం జరుగుతుందని వారు భావించారు. కానీ ఇంతవరకు ఎలాంటి ఉపశమనం కార్యకర్తలకు



లభించలేదు. ఒకవేళ కొంతమందికి పదవులు ఇస్తే.. మిగతావారు పార్టీకి దూరమవుతారని.. అసంతృప్తిని రాజేస్తారని పార్టీ అధిష్టానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందువల్లే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవడానికి ఇంతకాలం వేచి చూస్తూ ఉందని సమాచారం.సంస్థ గత నియామకాలు మాత్రమే కాదు వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా గెలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలంగా భావిస్తున్నారు. కానీ పార్టీలో కిందిస్థాయి నాయకులలో ఆ స్థాయిలో కదలిక ఏమాత్రం కనిపించడం లేదు. పట్టభద్రులలో ప్రభుత్వం మీద తీవ్రస్థాయిలో అసం తృప్తి ఉంది. ప్రత్యర్థులు రచిస్తున్న వ్యూహాలను సమర్థవం తంగా ఎదుర్కొనే స్థాయి పార్టీకి ఉన్నట్టు కనిపించడం లేదు. గవర్నర్ కోట ఎమ్మెల్సీ సీట్ల భర్తీ కోసం ఇప్పటికే చాలామంది నాయకులు ఢిల్లీలో పైరవీలు చేస్తున్నారు. ఆశావహులు కూడా ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇన్ని రకాల పరిణామాలు జరుగుతు న్నప్పటికీ ఒక్క స్థానం విషయంలో కూడా అధిష్టానం ఏకాభిప్రాయాన్ని ప్రదర్శించలేకపోతోంది..వాస్తవానికి ఒక నిర్ణయం తీసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీలో అనేక రకాలుగా మంతనాలు జరుగుతాయి. సీఎం చేతిలో అధికారం ఉండదు. పీసీసీ అధ్యక్షుడు నిర్ణయాన్ని తీసుకోలేడు. మంత్రులు చెప్పినప్పటికీ మాట చెల్లుబాటు కాదు. మిగతా ప్రజా ప్రతినిధుల విషయంలో కూడా ఇలానే జరుగుతుంది. ప్రతి దానికి అధిష్టానం మాత్రమే ఆమోదముద్ర వేయాలి.. దీనికి తోడు ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ.. హై కమాండ్ ఇలా రకరకాల షరతులు కాంగ్రెస్ పార్టీలో ఉంటాయి. అందువల్లే ఏది త్వరగా అమలు కాదు. ఆచరణలో పడదు. అందువల్లే ఈ సుదీర్ఘ ప్రక్రియ కాంగ్రెస్ పార్టీని నిలిపివేస్తోంది. అధికారులు ఉన్నప్పటికీ నిర్ణయాధికారం లో దూకుడుతనం లేదు. ప్రతి సమస్యను పరిష్కరించకుండా వదిలేయడం.. కాలయాపన చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారింది. ఇలానే జరిగిపోతే మాత్రం ఈ దసరా కాదు.. వచ్చే దసరాకు కూడా పదవుల భర్తీ కాంగ్రెస్ పార్టీలో పూర్తికాదు.

## అక్టోబర్ 25-26 వ తేదీన జరిగే ఇందిరాపార్క్ ధర్నాల ను జయప్రదం చేయండి..

**సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో గోడ పోస్టర్ ఆవిష్కరణ**

**జమ్మికుంట,** జమ్మికుంట స్థానిక పట్టణ కేంద్రంలో శనివారం రోజున, సిఐటియు చలో హైదరాబాద్ మల్టీపుల్ డేస్ ధర్నాను జయప్రదం చేయాలని గోడ పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని×పిఆర్సి అమలు డీఏ వర్తింప చేయాలని× ప్రతి కార్మికుడికి కనీస వేతనం30,000/- రూపాయల ఉద్యోగ, సామాజిక భద్రత కల్పించాలని× హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పై డిమాండ్ల పరిష్కార సాధన కోసం వేలాది మంది కార్మికులతో ఇంద్ర పార్క్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదిస్తూ, ప్రభుత్వ రంగా సంస్థలన్నీ ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులకు గంపగుత్తగా అమ్మివేస్తూ, భవిష్యత్ తరాలచదువుకున్న పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగం అనేది లేకుండా చేసే కుట్రలో భాగంగానే, ప్రభుత్వ రంగ సంస్థలను లేకుండా చేస్తుందని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన ఉత్తుత్తి మాటలేనని, కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్నా కాస్త, కుస్తో చిన్న పరిశ్రమలు మధ్యతరగతి పరిశ్రమలు మూతపడుతూ లక్షలాదిమంది కార్మికుల ఉపాధి పోయి రోడ్డున పడుతున్నారని దీనికి నిదర్శనం బిజెపి పాలిత ప్రాంతాల నుండి నిత్యం లక్షలాదిమంది కార్మికులు దక్షిణాది రాష్ట్రాలకు వలస వస్తున్నారని బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటే పొట్ట చేత పట్టుకొని ఇక్కడికి వలసలు రావలసిన అవసరం ఏముందని వలస కార్మికులతో తక్కువ వేతనాలకు పని చేయిస్తూ శ్రమదోపిడి చేస్తుంది యజమాన్యాలని ఆరోపించారు.ఈ ధర్నా కార్యక్రమనికీ ఆశ, గ్రామపంచాయతీ,మున్సిపల్, అవుట్సోర్సింగ్, స్థానిక సంస్థల ఉద్యోగులు, బీడీ, బిల్డింగ్, ట్రాన్స్పోర్ట్, హమాలి, మధ్యాహ్న భోజనం, అంగన్వాడి, మెడికల్ ఉద్యోగులు, తదితర రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జక్కుల రమేష్ యాదవ్, పుల్ల కర్ణాకర్, సుభాష్, సారంగపాణి పోచయ్య, మదనయ్య, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## పుష్కర పనులను వేగవంతం చేయాలి దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు

**జయశంకర్ భూపాలపల్లి,** గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరంలో పుష్కరఘాట్ల అభివృద్ధి పనులతో పాటు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కాళేశ్వరం క్షేత్రంలో పర్యటించిన కమిషనర్ దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ ప్రత్యేకంగా పరిశీలించారు. అన్ని నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టి, అవసరమైనంత మంది కార్మికులను నియమించి షిఫ్టుల వారీగా పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అక్షరాభ్యాస మండపం, అద్దాల మండపం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఆలయ పునర్నిర్మాణాన్ని రూపొందించిన ప్రణాళికకు, సంప్రదాయ వాస్తు నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి మార్పులు, వ్యత్యాసాలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కాంక్రీట్ పనుల్లో వైబ్రేటర్లను వినియోగించాలని, గోనె సంచులు, వరి గడ్డితో తగిన విధంగా వాటర్ క్యూరింగ్ చేపట్టాలని సూచించారు. ప్రతి నిర్మాణ పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి పటిష్ఠంగా పూర్తి చేయాలన్నారు.వచ్చే నెల 4వ తేదీన రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కాళేశ్వరం పర్యటనకు రానున్న నేపథ్యంలో అప్పటిలోగా పనుల్లో గణనీయమైన పురోగతి సాధించాలని, నిర్మాణాలు స్పష్టమైన రూపు సంతరించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తాగునీరు, రహదారులు, పార్కింగ్, వీఐపీ ఘాట్లు తదితర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలన్నారు. గత పుష్కరాల సందర్భంగా ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈసారి మరింత పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వాచ్ టవర్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కరఘాట్లకు ఇరువైపులా ర్యాంపుల నిర్మాణం చేపట్టాలని, గోదావరిలో పుష్కర స్నానాలు ఆచరించే భక్తుల భద్రతకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కాళేశ్వరంలో ఆలయ పునర్నిర్మాణ పనులతో పాటు గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ పర్యటనలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్నినో విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది

**కరీంనగర్** ఎల్నినో విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా సిద్ధంగా ఉందని ప్రజలు నీరు,కరెంటు విషయంలో పొదుపు పాటించాలని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ముకరంపురలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎల్నినో కారణంగా అనేక దేశాలు ఇబ్బందులు పడుతున్నాయని ఎన్నో ఏళ్ల తరువాత ఈ విపత్తు ఏర్పడిందని,ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం సూచించిన విధంగా సహకరించాలని కోరారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి సమస్య అదేవిధంగా విద్యుత్ కొరత సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ రెండిటి విషయంలో ప్రజలు పొదుపు పాటించాలని కోరారు.ఇది ప్రకృతి వైపరీత్యం వల్ల ఏర్పడిన విపత్తు అయితే ప్రతిపక్షాలు కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ప్రభుత్వంపై తోసేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నాయని, ఇటువంటి సందర్భాలలో ప్రతి పక్షాలు భాధ్యతగా వ్యవహరించాలని,గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా వైరస్ వ్యాప్తి విషయంలో ఆనాడు కాంగ్రెస్ పార్టీ భాధ్యతగా వ్యవహరించలేదా అని ప్రశ్నించారు. ఎల్నినో విపత్తును ఎదుర్కొనేందుకు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ,ప్రభుత్వ పెద్దల నిర్ణయమే శిరోధార్యం నామినేటెడ్ పదవుల విషయంలో సుడా చైర్మన్ పదవి గురించి ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకు నరేందర్ రెడ్డి సమాధానం చెప్తూ 30 సంవత్సరాలకు పైగా నిబద్ధతతో కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నానని మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో టికెట్ ఆశించి భంగపడ్డా పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ఎవరికి అవకాశం ఇచ్చినా వారితో కలిసి పనిచేయడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుడా చైర్మన్ గా నాకు అవకాశం కల్పించినందుకు ఎప్పటికీ కృతజ్ఞతభావంతో ఉంటానని సుడా చైర్మన్ గా కూడా ఎంతో నిబద్ధతతో పని చేశానని సుడాకు రెవిన్యూ జనరేట్ చేసి ఆ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందని ఇంకా మిగిలిపోయిన పనులు పూర్తి చేయడానికే రీన్యూవల్ కోసం ప్రయత్నిస్తున్నానని నరేందర్ రెడ్డి పేరొన్నారు. కావాలని కొంతమంది లేనిదాన్ని ఉన్నట్టు చూపించి నాపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని అటువంటి ప్రయత్నాలు మానుకోవాలని ఎవరేమిటో ప్రజలకు తెలుసని నరేందర్ రెడ్డి అన్నారు.

## పుష్కర పనులను వేగవంతం చేయాలి :దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు

**జయశంకర్ భూపాలపల్లి,** గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరంలో పుష్కరఘాట్ల అభివృద్ధి పనులతో పాటు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కాళేశ్వరం క్షేత్రంలో పర్యటించిన కమిషనర్ దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ ప్రత్యేకంగా పరిశీలించారు. అన్ని నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టి, అవసరమైనంత మంది కార్మికులను నియమించి షిఫ్టుల వారీగా పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అక్షరాభ్యాస మండపం, అద్దాల మండపం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఆలయ పునర్నిర్మాణాన్ని రూపొందించిన ప్రణాళికకు, సంప్రదాయ వాస్తు నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి మార్పులు, వ్యత్యాసాలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కాంక్రీట్ పనుల్లో వైబ్రేటర్లను వినియోగించాలని, గోనె సంచులు, వరి గడ్డితో తగిన విధంగా వాటర్ క్యూరింగ్ చేపట్టాలని సూచించారు. ప్రతి నిర్మాణ పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి పటిష్ఠంగా పూర్తి చేయాలన్నారు.వచ్చే నెల 4వ తేదీన రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కాళేశ్వరం పర్యటనకు రానున్న నేపథ్యంలో అప్పటిలోగా పనుల్లో గణనీయమైన పురోగతి సాధించాలని, నిర్మాణాలు స్పష్టమైన రూపు సంతరించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తాగునీరు, రహదారులు, పార్కింగ్, వీఐపీ ఘాట్లు తదితర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలన్నారు. గత పుష్కరాల సందర్భంగా ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈసారి మరింత పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వాచ్ టవర్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కరఘాట్లకు ఇరువైపులా ర్యాంపుల నిర్మాణం చేపట్టాలని, గోదావరిలో పుష్కర స్నానాలు ఆచరించే భక్తుల భద్రతకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కాళేశ్వరంలో ఆలయ పునర్నిర్మాణ పనులతో పాటు గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ పర్యటనలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు

ఆధునిక కాలంలో యుద్ధాలు కేవలం ఆయుధాలతోనే కాకుండా దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కూడా జరుగుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయని తెలిపారు. 'నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగవని మనందరికీ తెలుసు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు. భారత్ ఆర్థికంగా బలపడుతున్న తరుణంలో, మన బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ నేరస్థులు, సైబర్ ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవడం కూడా అంతే ముఖ్యం. నేడు, సైబర్ ముప్పుల రూపురేఖలు నిరంతరం మారుతున్నాయి. పాతబడిన వ్యవస్థలు, పాత శిక్షణా పద్ధతులు లేదా కాలం చెల్లిన సాధనాలతో ఈ కొత్త సవాళ్లను మనం ఎదుర్కోలేం. మనకు ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఇక్కడే ఈ కొత్త సైబర్ సెక్యూరిటీ సంస్థ కీలక పాత్ర పోషించనుంది' అని ప్రధాని మోదీ అన్నారు.

**సామాన్యులకు బ్యాంకింగ్ సేవలు**

దేశ బ్యాంకింగ్ రంగం ప్రస్తుతం ప్రపంచంలోనే సమర్థంగా పనిచేస్తున్న వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని ప్రధాని



పేర్కొన్నారు. ప్రజలకు రోజులో 24 గంటలూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. చిన్న వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారు, వీధి వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికులకు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ప్రయోజనాలు అందుతున్నాయని వివరించారు. గతంలో బ్యాంకింగ్ సేవలు కొద్దిమంది సంపన్నులు, పలుకుబడి ఉన్నవారికే ఎక్కువగా పరిమితమయ్యాయని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ధనికులకు రుణాలు సులభంగా లభించేవని, పేదలు, మధ్యతరగతి ప్రజలు, మహిళలకు తగిన అవకాశాలు దక్కలేదని ఆరోపించారు. 2014 తర్వాత సమతుల్య విధానాన్ని అనుసరించడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చిందని పేర్కొన్నారు. గతంలో డెబిట్, క్రెడిట్ కార్డులు సామాన్యులకు అందని విలాస వస్తువులుగా ఉండేవని, ప్రస్తుతం అవి విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

**రానున్న దశాబ్దంలో మరింత సమర్థమైన సేవలు**

గత పదేళ్లలో బ్యాంకింగ్ సేవలు అందని వర్గాలకు వాటిని చేరువ చేయడంపై దృష్టి సారించామని మోదీ చెప్పారు. ఇక రానున్న దశాబ్దంలో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత సమర్థంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండటమే కాకుండా, వాటిని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినియోగించుకునేలా చూడాలని అభిప్రాయపడ్డారు. డిజిటల్ లావాదేవీల భద్రత, వేగవంతమైన సేవలు, ఆర్థిక వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం భవిష్యత్తులో కీలకమని ఆయన వ్యాఖ్యల

**రూ.169 కోట్లతో కీలక సదుపాయాలు**

భువనేశ్వర్‌లో ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రధాని ప్రారంభించారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవల భద్రతను బలోపేతం చేయడం, సైబర్ ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో ఈ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరమని మోదీ అన్నారు. కొత్త సదుపాయాలు ఈ దిశగా ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక ఒడిశా అభివృద్ధిపై కూడా ప్రధాని మాట్లాడారు. గనుల రంగం నుంచి మైక్రోచిప్‌ల తయారీ వరకు పలు రంగాల్లో రాష్ట్రం భవిష్యత్తును నిర్మించుకోగలదని అన్నారు. యువతకు కొత్త అవకాశాలు కల్పించే అనేక మార్గాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.

# మోదీపై ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ మధ్య రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. బిహార్ రాజధాని పట్నాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ తండ్రిని ప్రస్తావిస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీయగా బీజేపీ మండిపడింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్ అధ్యక్షుడిపై విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీకి, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

బిహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సింగ్ 139వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన వారందరినీ కాంగ్రెస్ పార్టీ జైలుకు పంపిస్తుందని ఖర్గే అన్నారు. ఇక్కడ ఖర్గే ప్రసంగిస్తున్న సమయంలోనే సంతోష్ కుమార్ అనే ఓ వ్యక్తి 'తిరుగుబాటు జరిగేంతవరకు మోదీ ఎక్కడికీ వెళ్లరు' అని అరిచారు. దీంతో స్పందించిన ఖర్గే ఆగ్రహంతో 'మోదీ కా బాప్ భీ జాయేగా, బాప్ భీ జాయేగా (మోదీనే కాదు, మోదీ తండ్రి కూడా వెళ్లాల్సిందే)' అని అన్నారు. ఈ వ్యాఖ్యల అనంతరం సభలో అలజడి రేగగా, నినాదాలు చేసిన ఆ వ్యక్తిని సభ నుంచి బయటికి పంపించారు. తన వ్యాఖ్యలపై ఖర్గే సమర్థించుకుంటూ, ప్రభుత్వం ప్రజాస్వామ్య సూత్రాల్ని ఉల్లంఘిస్తోందని, సర్ ప్రక్రియ ద్వారా ఎన్నికల్ని ప్రభావితం చేస్తోందని అన్నారు. ఇక ఖర్గే వ్యాఖ్యలను ఎన్డీఏ నేతలు తీవ్రంగా ఖండించారు.

**అమిత్ షా తీవ్ర విమర్శలు**

ఖర్గే వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎక్స్‌లో స్పందించారు. పట్నాలో మోదీ తండ్రిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా ఖర్గే అన్ని హద్దులను దాటారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు గతంలోనూ మోదీని,



ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని షా విమర్శించారు. వరుస ఓటములతో కాంగ్రెస్ తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిందని, చేసేదేం లేక వ్యక్తిగత దూషణలకు దిగుతోందని ఆరోపించారు.

'కాంగ్రెస్ అధ్యక్షుడి నోటి వెంట వచ్చిన మాటలు రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం. ప్రధాని మోదీ, ఆయన కుటుంబంపై కాంగ్రెస్ నేతలు అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించడం ఇదేం మొదటిసారి కాదు. గతంలో ఆయన తల్లిని అవమానించారు. ఆయనను మర్చంట్ ఆఫ్ డెత్ అన్నారు. ఆయన పేదరికాన్ని ఎగతాళి చేస్తూ ఛాయ్‌వాలా అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ రోజురోజుకూ హద్దుల్ని దాటుతోంది. సంయమనం కోల్పోతుంది' అని అమిత్ షా పేర్కొన్నారు.

**నిబిన్ నబిన్ ఫైర్**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా ఖర్గే వ్యాఖ్యలను తప్పుబట్టారు. రాజకీయ ప్రత్యర్థుల్ని విమర్శించేటప్పుడు కూడా గౌరవం, మర్యాదలు పాటించాలని పేర్కొన్నారు. మరణించిన కుటుంబ సభ్యులను రాజకీయ ప్రసంగాల్లోకి తీసుకురావడం తగదని అన్నారు. దేశాభివృద్ధి, ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలపై మాట్లాడేదేం లేకనే ప్రతిపక్షాలు ఇలా వ్యక్తిగత దాడులకు దిగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇంకా ఖర్గే వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ కూడా ఎక్స్‌లో తీవ్ర విమర్శలు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రౌడీలు, గూండాలు వాడే భాషను ఉపయోగిస్తున్నారని పేర్కొంది. ఇది రాజకీయం కాదు, అచ్చం మాఫియా గ్యాంగ్ ప్రవర్తనలా ఉందని విమర్శించింది. ఇతర కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, గిరిరాజ్ సింగ్, పీయూష్ గోయల్ సహా మాజీ మంత్రులు, ఎంపీలు ధర్మేంద్ర ప్రదాన్, రవిశంకర్ ప్రసాద్, బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర, బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ కూడా ఖర్గే వ్యాఖ్యల్ని ఖండిస్తూ, తక్షణమే మోదీకి, దేశప్రజలకు ఖర్గే, రాహుల్, సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఖర్గేపై పోలీసులకు ఫిర్యాదు**

కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలపై బిహార్ బీజేపీ పోలీసుల్ని ఆశ్రయించింది. పట్నాలోని పోలీస్ స్టేషన్‌లో మల్లికార్జున్ ఖర్గేపై ఫిర్యాదు నమోదు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, ఆయన తండ్రిని ఉద్దేశించి ఖర్గే అవమానకరమైన భాష ఉపయోగించారని ఆరోపించిన అక్కడి నాయకులు, ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఎస్ఐఆర్, బ్లాక్‌మనీని ప్రస్తావిస్తూ ఖర్గే విమర్శలు**

వివాదానికి ముందు ఖర్గే తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సర్‌ను తక్షణమే నిలిపివేయాలని, ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. భవిష్యత్తులో ఎన్నికల్ని బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించాలని, గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ తొలి 100 రోజుల్లో నల్లధనాన్ని తిరిగి తీసుకొస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ, ఆ డబ్బు ఏమైందని ఖర్గే ప్రశ్నించారు. ఇంకా బిహార్ మాజీ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఎన్డీయే కూటమితో కలవడాన్ని కూడా ఖర్గే విమర్శించారు. అయితే దీనిపై స్పందించిన జేడీయూ ఖర్గే ఆరోపణల్ని తోసిపుచ్చింది. ఎన్నికలు నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరిగాయని పేర్కొంది.

# ఓటును, దేశాన్ని కాపాడుకుందాం

## నవంబర్ 1న భారీ ర్యాలీకి రాహుల్ గాంధీ పిలుపు

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, ఓట్ల చోరీ ఆరోపణలపై నిరసనగా నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. 'సేవ్ ది ఓట్ సేవ్ ది కంట్రీ' పేరుతో జన మార్చ్, భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపారులు సహా ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఓటర్ల జాబితాల నుంచి పేర్లను తొలగిస్తున్నారు. నిబంధనలను, చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. అక్రమాలపై ప్రశ్నలు లేవనెత్తిన వారిపై లాఠీలతో దాడులు చేశారు. దీనిని ఏ పరిస్థితుల్లోనూ ప్రజలు మౌనంగా సహించరు. నవంబర్ 1న ఢిల్లీకి పదండి. ఓటును, దేశాన్ని కాపాడుకుందాం. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు పౌరులు ఉద్యమంలో భాగస్వాములు కావాలి. ఓటు మీది. పోరాటమూ మీదే' అంటూ రాంలీలా మైదాన్?, ఢిల్లీ అని పోస్ట్?లో రాసుకొచ్చారు. అలాగే గమనిక అని తమ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్న బీజేపీ, దాని మిత్రపక్షాలకు వ్యంగ్యంగా కృతజ్ఞతలు తెలిపారు. ర్యాలీకి ముందు మరో ఏడు రోజులపాటు ఇదే ఉత్సాహంతో ప్రచారం కొనసాగించాలని వ్యాఖ్యానించారు.

**మూడు రోజులపాటు ఢిల్లీలోనే ఎంపీలు**

ఇదిలా ఉండగా, ర్యాలీ నేపథ్యంలో పార్టీ ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక సూచనలు చేశారు.



అక్టోబర్ 30,31, నవంబర్ 1 తేదీల్లో ఎంపీలంతా ఢిల్లీలో అందుబాటులో ఉండాలని కోరారు. ఓట్ల చోరీ ఆరోపణలు, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ఎంపీలు పాల్గొనేలా కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల అక్రమాలు, ఓట్ల తొలగింపును నిరసిస్తూ అక్టోబర్ 30న ఢిల్లీలోని అశోక్ హోటల్ వేదికగా విపక్షాలు మాక్ పార్లమెంట్ నిర్వహించనున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న జజుజ తీరును ఎండగడుతూ ప్రతీకాత్మకంగా ఆయనపై ఈ వేదికగా ప్రజా అభిశంసన చేపట్టనున్నారు. ఇండియా కూటమికి చెందిన ఎంపీలు, అగ్రనేతలంతా హాజరయ్యే ఈ సమావేశంలో జజుజకి వ్యతిరేకంగా ఒక బహిరంగ ప్రజా తీర్పును కూడా వెల్లడించనున్నారు. ఈ మాక్ పార్లమెంట్ ముగిసిన అనంతరం నవంబర్ 1న ఓట్ చోరీకి వ్యతిరేకంగా పదిలక్షల మందితో రాంలీలా మైదానానికి ఢిల్లీ చలో మార్చ్ నిర్వహించాలని కాంగ్రెస్ తలపెట్టింది.

**రామమందిర విరాళాలపై జైరాం రమేశ్ ప్రశ్నలు**

ఇదిలా ఉండగా, అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల వ్యవహారాన్ని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మరోసారి ప్రస్తావించారు. ప్రధాని మోదీ ఉత్తరప్రదేశ్ పర్యటన నేపథ్యంలో ఈ అంశంపై ఆయన స్పందించారు. ఆలయానికి వచ్చిన విరాళాలు, కానుకల లెక్కలపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ నిష్పక్షపాత దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఆలయ ట్రస్టీల నియామకంపైనా ప్రశ్నలు లేవనెత్తారు. బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలున్న వ్యక్తులను ట్రస్టీలుగా నియమించారని ఆరోపించారు. విరాళాల వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో నిధి సమర్పణ కార్యక్రమం, కార్పస్ విరాళాల ద్వారా మొత్తం రూ.3,264 కోట్లు సేకరించినట్లు ఆర్ఎస్ఎస్, ఆలయ ట్రస్టు వెల్లడించిన గణాంకాలను జైరాం రమేశ్ ప్రస్తావించారు. 2024లో తొమ్మిది నెలల్లో 13.55 కోట్ల మంది భక్తులు అయోధ్యకు వచ్చారని, 2025 మహాకుంభమేళా సమయంలో మరో పది కోట్ల మంది వరకు సందర్శించారని పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు సుమారు 16 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు చెబుతున్నప్పటికీ, హుండీలు, కౌంటర్ల ద్వారా రూ.82.78 కోట్ల కానుకలు మాత్రమే వచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయని ఆయన అన్నారు. ఈ గణాంకాల మధ్య ఉన్న వ్యత్యాసంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

## ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ డౌన్



కొన్నేళ్లుగా శీతాకాలం వస్తోందంటే చాలు ఢిల్లీ ప్రజలను చలితో పాటు కాలుష్య భయమూ వెంటాడుతోంది. పొగమంచు, పడిపోతున్న గాలి నాణ్యత ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలాంటి శ్వాసకోశ సమస్యలు లేనివారిని సైతం ఈ విషగాలి వదలడం లేదు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఈ కాలుష్యానికి అత్యంత సులువుగా బలవుతున్నారు. ఆస్తమా, జ్వరాణ వంటి దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు ఉన్నవారికి వాయు కాలుష్యం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కేవలం ఊపిరితిత్తులకే కాకుండా, ఇది హృద్రోగాలకూ దారితీసి, గుండెపోటు ముప్పును గణనీయంగా పెంచుతుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "కాలుష్యం పెరిగితే సమస్యలు తీవ్రమవుతాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆస్తమా, సీఓపీడి, ఊపిరితిత్తుల్లో ఫైబ్రోసిస్ లాంటి ముందస్తు సమస్యలు ఉన్నవారికి ఈ కాలుష్యం శాపంగా మారుతుంది. ఇక గర్భిణీలు కూడా దీనివల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది"

దేశ రాజధానిలో కాలుష్య కోరల నుంచి రక్షించుకోవడానికి ప్రజలు తక్షణ స్వీయజాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ స్థాయిలను బట్టి బయటకు వెళ్లాలో, వద్దో తమపై తామే ఆంక్షలు విధించుకోవాలని స్పష్టం చేస్తున్నారు. "ఈ సీజన్‌లో గాలి నాణ్యత దెబ్బతింటుంది. ఏక్యూఐ300 దాటితే శ్వాసకోశ, గుండె జబ్బులు ఉన్నవారు బయట తిరగడం తగ్గించాలి. అదే 400 దాటితే అసలు బయటకు రాకూడదు. ఇక ఏక్యూఐ 200 నుంచి 300 మధ్య ఉంటే మాత్రం బహిరంగ ప్రదేశాల్లో వ్యాయామాలు పూర్తిగా మానుకోవాలి" అని ఊపిరితిత్తుల నిపుణుడు డా.వివేక్ నాంగియా తెలిపారు.

**అనవసరంగా బయట తిరగకపోవడమే!**

కాలుష్య ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఇళ్లలోని గాలి నాణ్యతను మెరుగుపరుచుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని జనరల్ ఫిజీషియన్లు సూచిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు... తగిన జాగ్రత్తలు తీసుకుంటూ..అనవసరంగా బయట తిరగకపోవడమే ఉత్తమమని చెబుతున్నారు.

"కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లేటప్పుడు మాస్క్ ధరించడం మంచి రక్షణ కవచంగా ఉంటుంది. అలాగే ఇళ్లలో, ఇండోర్‌లో గాలి నాణ్యతను మెరుగుపరచుకోవాలి. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు.. ఈ నిబంధనలను తప్పక పాటించాలి"

ఢిల్లీలో చలికాలం అంటే కేవలం ఉష్ణోగ్రతలు పడిపోవడం మాత్రమే కాదు. ఊపిరి సలపని గాలి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కొన్నేళ్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థ కాలుష్య నివారణకు కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పులు రావడంలేదు.

## ఉగ్రవాదం ప్రపంచ శాంతికి ప్రాణాంతకమైన ముప్పు



ఉగ్రవాదాన్ని రాజకీయ సాధనంగా వాడుకోవడాన్ని అంగీకరించబోమని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. కొన్ని దేశాలు ఉగ్రవాదం పట్ల కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే ఈ ముప్పు ఇంకా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత అనుభవాలు ఎన్నో గుణపాఠాలు నేర్పుతున్నా, కొన్ని దేశాలు ఇప్పటికీ రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని పాకిస్థాన్‌ను పరోక్షంగా విమర్శించారు. ఢిల్లీలో జరిగిన చిన్మయ మిషన్ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన ఎక్కడో ఒక చోట జరిగే యుద్ధం, ప్రపంచమంతటా ఉన్న శాంతికి ముప్పుగా పరిణమిస్తుందని హెచ్చరించారు. "ఉగ్రవాదం శాంతికి మరో ప్రాణాంతక ముప్పు. దానిని రాజకీయ సాధనంగా ఉపయోగించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. దానిని ఎన్నటికీ సమర్థించలేం. ఎన్నడూ హేతుబద్ధం చేయలేం. అయినప్పటికీ, అన్ని దేశాలు ఏమాత్రం సహనాన్ని ప్రదర్శించకపోవడం వల్ల ఇది కొనసాగుతూనే ఉంది. చరిత్ర ఎన్నో పాఠాలు నేర్పినప్పటికీ, కొన్ని దేశాలు ఇప్పటికీ రాజకీయ లెక్కలకే ప్రాధాన్యతనిస్తున్నాయి."

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణలను ప్రస్తావించిన జైశంకర్ దౌత్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సంక్షోభాల సమయంలో ఐక్యరాజ్యసమితి కేవలం ప్రేక్షకపాత్ర వహించకూడదని, నాయకత్వం వహించి పరిష్కార మార్గాలకు బాటలు వేయలాని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం లోపభూయిష్టమైన ప్రపంచంలో జీవిస్తున్నామని, అయితే దాన్ని మరింత మెరుగుపరిచేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా దాని ప్రభావం ఆ ప్రాంతానికే పరిమితం కాదని జైశంకర్ స్పష్టం చేశారు. ఒక చోట జరిగే సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా శాంతికి ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. అందువల్ల అన్ని దేశాలు శాంతిని కాపాడేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదం, యుద్ధాలు ప్రపంచ దేశాల భద్రతతో పాటు అభివృద్ధిపైనా ప్రభావం చూపుతాయని ఆయన వ్యాఖ్యానించారు. చరిత్ర నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను కొన్ని దేశాలు విస్మరిస్తున్నాయని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదం విషయంలో రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, అన్ని దేశాలు ఒకే విధమైన కఠిన వైఖరిని అవలంబించాలని సూచించారు.

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలను ప్రస్తావిస్తూ, సమస్యలను పరిష్కరించుకోవడానికి దౌత్యం, చర్చలే మార్గమని జైశంకర్ అన్నారు. యుద్ధాల వల్ల ఏర్పడే సంక్షోభాలను మరింత తీవ్రతరం చేయకుండా, చర్చల ద్వారా పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. భారత్ మొదటి నుంచి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. చర్చలు, దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనే భారత వైఖరి ప్రపంచ దేశాల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని అన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం అనేక సమస్యలు ఉన్నప్పటికీ, పరిస్థితులను మెరుగుపరిచేందుకు దేశాలు నిరంతరం కృషి చేయాలని జైశంకర్ అభిప్రాయపడ్డారు. యుద్ధాలు, హింసకు బదులుగా శాంతి, సహకారం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రపంచ దేశాల మధ్య పరస్పర అవగాహన పెరిగినప్పుడే సంక్షోభాలకు పరిష్కారాలు కనుగొనడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**శ్రేయస్సు, అభివృద్ధి అందరికీ అందాలి**

ప్రపంచంలో అభివృద్ధి, శ్రేయస్సు ఒకవైపు, సంఘర్షణ, హింస మరోవైపు ఉంటాయని జైశంకర్ అన్నారు. ఈ రెండింటినీ విడివిడిగా చూడలేమని పేర్కొన్నారు. ప్రపంచీకరణ, సంక్లిష్టమైన సరఫరా గొలుసులు, పరస్పరం అనుసంధానమైన మార్కెట్ల నేపథ్యంలో ఒక ప్రాంతంలో నెలకొనే అస్థిరత ఇతర ప్రాంతాలపైనా ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రపంచంలోని కొంతమంది ప్రజలు మాత్రమే శ్రేయస్సుతో జీవిస్తూ, మిగిలిన వారు లేమిలో కొనసాగితే స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదని జైశంకర్ పేర్కొన్నారు. ఉగ్రవాదం సహా ప్రపంచం ఎదుర్కొంటున్న ఉమ్మడి ముప్పులపై దేశాలు మరింత స్పష్టమైన అవగాహన పెంచుకోవాలని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ, అన్ని వ్యక్తీకరణల్లోనూ ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సమాజం దృఢ సంకల్పంతో ఏకం కావాలని పిలుపునిచ్చారు.

# ఓటు నమోదుకు ముందుకు రాని యువత!

-మొదటిపేజీ తరువాయి

కాకపోవడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యేకంగా క్యాంపులు పెట్టే అంశంపై దృష్టి సారించాయి.

తక్కువగా ఓటర్లు నమోదు అయితే గెలుపోటములపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉండడంతో గడువులోగా సాధ్యమైనంత ఎక్కువ మందిని ఓటర్లుగా నమోదు చేయించాలని పార్టీల ప్రజా ప్రతినిధులు, కో-ఆర్డినేటర్లు భావిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో కూడా ప్రత్యేక మీటింగ్‌లను ఏర్పాటు చేసి గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై దృష్టి కేంద్రీకరించాయి.



### వచ్చినవీ బీఎల్‌వో స్థాయిలోనే

మరోవైపు రెండు ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఫారం-18 ద్వారా వచ్చిన కొత్త దరఖాస్తుల విచారణ ఇంకా బీఎల్‌వో స్థాయిలోనే ఉండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రస్తుతం వారు ఎస్?ఐఆర్? నోటీసులు, విచారణ దశలో ఉండడం కూడా ఒక కారణంగానే చూడవచ్చు. దీనివల్ల పూర్తి స్థాయిలో పట్టభద్రుల స్థానాల ఓటరు కార్యక్రమం (ఫారం-18)పై దృష్టి సారించడం వారికి కొంత ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 90 శాతానికి పైగా ఫారం-18 పత్రాలు ఆన్‌లైన్ ద్వారానే వచ్చినట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

### మూడు దశల్లో ఓటరు వివరాల విచారణ

కొత్త ఓటరు దరఖాస్తులను బీఎల్‌వో, ఏఈఆర్వో, ఈఆర్వో స్థాయిలో విచారణ చేసి తుది ఓటరు జాబితాలో చేర్చాల్సిన ప్రక్రియ ఉంటుంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పరిధిలో 1.91 లక్షల పత్రాల విచారణ ఇంకా బీఎల్‌వో స్థాయిలో ఉంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 2.29 లక్షల దరఖాస్తులు రాగా, ఇందులో 4,695 మందివి మాత్రమే ఇప్పటి వరకు తుది ఓటర్ల జాబితాలో చేర్చడం కోసం వివిధ డివిజన్ల ఈఆర్వో(ఆర్డీవో)లు ఆమోదించారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పరిధిలో 2.93 లక్షల ఓటు నమోదుకు దరఖాస్తులు రాగా, 1.96 లక్షల పత్రాలు బీఎల్‌వో స్థాయిలో విచారణ దశలోనే ఉండటం గమనార్హం. ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో 21,390 మందిని మాత్రమే తుది జాబితాకు పంపించారు. మిగతావి విచారణ దశలో, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

# ఎదురుదాడులా.. లీగల్ నోటీసులా...



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి అనుసరిస్తున్న వ్యూహాలు తీవ్ర ఆసక్తికర చర్చకు దారి తీస్తున్నాయి. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కోసం కొండపోచమ్మ సాగర్ కాలువ ద్వారా నీటిని మళ్లించారంటూ మీడియాలో వచ్చిన కథనాలు, కాంగ్రెస్ నేతలు చేసిన విమర్శలపై బీఆర్ఎస్ లీగల్ సెల్ వెంటనే రంగంలోకి దిగి లీగల్ నోటీసులు జారీ చేసింది. అంతకుముందు కూడా కేటీఆర్, హరీష్ రావుల పై ఎలాంటి ఆరోపణలు వచ్చినా.. రేవంత్ రెడ్డి, బండి సంజయ్ వంటి అగ్రనేతలకు సైతం లీగల్ నోటీసులు పంపడమే ప్రథమ మార్గంగా ఎంచుకున్నారు. అయితే, రాజకీయ రణరంగంలో శత్రుపక్షాల బాణాలకు పదునైన రాజకీయ ఎదురుదా తో సమాధానమివ్వాల్సింది పోయి.. కోర్టుల చుట్టూ, నోటీసుల చుట్టూ తిరగడం బీఆర్ఎస్‌ను ఆత్మరక్షణ లో పడేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎదసాధారణంగా ప్రజాస్వామ్య రాజకీయంలో ప్రజల్లోకి బలంగా వెళ్లేది వ్యూహాత్మక ఎదురుదాడి మాత్రమే. ప్రత్యర్థి ఒక ఆరోపణ చేసినప్పుడు దానికి అంతే పదునైన ఆధారాలతో, మీడియా, బహిరంగ సభల వేదికగా కౌంటర్ ఇచ్చి ఆ నరేటివ్‌ను తిప్పికొట్టడమే రాజకీయ పరిణతి. కానీ బీఆర్ఎస్ నేతలు ప్రతి చిన్న విషయానికి 'కోర్టుకు వెళ్తాం, లీగల్ నోటీసులు పంపాం అనడం వల్ల.. ప్రజల్లో ఒక రకమైన భావన ఏర్పడే ముప్పు ఉంది. నోటీసులు పంపడం వల్ల ఐపీసీ, క్రమశిక్షణా పరిధిలో చట్టపరమైన రక్షణ లభిస్తుందేమో కానీ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఆరోపణలు నిజమేనేమో, అందుకే మాట్లాడకుండా లీగల్ షీల్డ్ వెనుక దాక్కుంటున్నారు అనే సందేహాలకు ఆస్కారం లభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో కేటీఆర్ పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇతర సీనియర్ నాయకులకు లీగల్ నోటీసులు పంపిన ఘటనలు చూశాం. అయితే, భారతదేశంలో లీగల్ నోటీసు నోటీసుగానే మిగిలిపోయి, అవమాన నష్టపరిహారం కేసులు కోర్టుల్లో ఏళ్ల తరబడి సాగుతాయి. రాజకీయాల్లో ఎన్నికల ఫలితాలు, ప్రజాభిప్రాయం క్షణాల్లో మారిపోతుంటాయి. అలాంటప్పుడు న్యాయపరమైన నోటీసులు ఇచ్చి ప్రకటనలకు పరిమితమవ్వడం కంటే, మైక్ ముందు నిలబడి ఆధారాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తేనే పొలిటికల్ మైలేజ్ దక్కుతుంది. లీగల్ మార్గాన్ని ఆశ్రయించడం ద్వారా ఆరోపణలను మరింత కాలం వార్తల్లో సజీవంగా ఉంచినట్లవుతోందనే విమర్శలు కూడా ఉన్నాయి. బీఆర్ఎస్ వర్గాలు మాత్రం తమ లీగల్ వ్యూహాన్ని గట్టిగా సమర్థించుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని పథకం ప్రకారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చేందుకు అసత్య ప్రచారాలు చేస్తోంది అని వారు ఆరోపిస్తున్నారు. రాజకీయంగా మీడియా సమావేశాలు పెట్టి ఎన్ని కౌంటర్లు ఇచ్చినా, సామాజిక మాధ్యమాలు, అనుకూల మీడియా ద్వారా తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నందున.. దానికి చట్టపరమైన చెక్ పెట్టడమే సరైన మార్గమని పార్టీ భావిస్తోంది. నోటీసులు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో దుష్ప్రచారం చేసేవారిలో ఒక రకమైన భయం ఏర్పడుతుందని గులాబీ నేతలు వాదిస్తున్నారు. పొలిటికల్ మైండ్ గేమ్‌లో డిఫెన్స్ ఎప్పుడూ వీక్‌నెస్‌ను సూచిస్తుంది . అధికారంలో ఉన్న కాంగ్రెస్, బిజెపిలు బీఆర్ఎస్ బలహీనతలను పసిగట్టి వరుసగా ఆరోపణల వర్షం కురిపిస్తున్న వేళ.. బీఆర్ఎస్ కేవలం లీగల్ సెల్ కారెక్టర్‌కే పరిమితమైతే రాజకీయంగా తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ప్రజలు నాయకుల నుంచి పదునైన వాగ్ధాటిని, ప్రజాక్షేత్రంలో వీరోచిత పోరాటాన్ని కోరుకుంటారు తప్ప, న్యాయవాదుల కాగితపు పోరాటాలను కాదని అంటున్నారు.

# అవినీతి అధికారులకు సెక్రటేరియట్‌లో లాబీయింగ్



**హైదరాబాద్ :** తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నెలకు సగటున 20 నుంచి 25 కేసుల వరకు నమోదు చేస్తూ లంచగొండి అధికారుల పాలిట సింహస్వప్నంగా మారుతున్నారు. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం, అక్రమాస్తుల కేసుల్లో దాడులు జరగడం రోజువారీ వార్తల్లో చూస్తూనే ఉన్నాం. అయితే, అలా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన అధికారులు ఆ తర్వాత ఏమవుతున్నారు? కోర్టుల్లో శిక్షలు పడుతున్నాయా అంటే.. సచివాలయంలోని కొన్ని విభాగాల మద్దతుతో, చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని విచారణ నుంచి హాయిగా తప్పించుకుంటున్నారనే సంచలన నిజాలు బయటపడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ ప్రభుత్వానికి సమర్పించిన న నివేదిక ప్రకారం.. ఏసీబీ అధికారులు విచారణ పూర్తి చేసి సచివాలయానికి ప్రాసిక్యూషన్ అనుమతి కోసం పంపినప్పుడు తీవ్ర ఆలస్యం జరుగుతోంది. ప్రత్యక్షంగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారుల కేసులను కూడా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. ఆ తర్వాత వాటిని కోర్టు విచారణ దాకా వెళ్లకుండా, నామమాత్రపు శాఖా పరమైన విచారణ లకు బదిలీ చేసి ఏసీబీ కేసులను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తున్నారు. గడిచిన కొన్నేళ్లలో ఏసీబీ విచారణ అనుమతి కోరిన 22 కేసుల్లో ప్రభుత్వం అనుమతి నిరాకరించి, కేసులను ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. అవినీతి నిరోధక చట్టం ప్రకారం ఉన్న సెక్షన్ 17ఎ నిబంధనను ప్రభుత్వ అధికారులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. అయితే దీనిపై అక్టోబర్ 16న స్పందించిన భారత అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అధికారిక విధులు నిర్వహించడంలో తీసుకునే నిర్ణయాలకు మాత్రమే సెక్షన్ 17ఎ రక్షణ కల్పిస్తుంది. లంచం అడగడం లేదా తీసుకోవడం అనేది ఏ రకంగానూ అధికారిక విధి కిందకు రాదు. కాబట్టి రెడ్ హ్యాండెడ్‌గా లంచం తీసుకుంటూ పట్టుబడే అధికారులను విచారించడానికి ఎలాంటి ముందస్తు ప్రభుత్వ అనుమతి అవసరం లేదు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సచివాలయంలో అవినీతి అధికారులను కాపాడుతున్న బలమైన లాబీ కి చెక్ పెట్టాలని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వ్యవస్థాపకులు ఎం. పద్మనాభరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మార్గదర్శకాల ప్రకారం, లంచం కేసుల్లో పట్టుబడిన అధికారులపై సెక్షన్ 17ఎ అనుమతి నెపంతో విచారణను నిలిపివేయకుండా ఏసీబీని నేరుగా ప్రాసిక్యూషన్‌కు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సచివాలయమే అవినీతిపరులకు రక్షణ కవచంగా మారితే సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## చిల్లర కోసం గొడవ

-మొదటిపేజీ తరువాయి

బస్సు ఎక్కారు. ఆమెతో పాటు ఉన్న బాలుడికి టికెట్ తీసుకోవాలని మహిళా కండక్టర్ సూచించారు. అయితే, మొదట టికెట్ తీసుకోవడానికి ప్రయాణికురాలు నిరాకరించింది. కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం బాలుడికి టికెట్ తీసుకునేందుకు అంగీకరించారు. టికెట్ కోసం కండక్టర్?కు ప్రయాణికురాలు డబ్బులు ఇచ్చారు.

### చిల్లర విషయంలో పెరిగిన వివాదం

టికెట్ ఇచ్చిన కండక్టర్ ప్రయాణికురాలు దిగేటప్పుడు మిగిలిన చిల్లర తీసుకోవాలని సూచించారు. అయితే, ఇప్పుడే చిల్లర ఇవ్వాలని ప్రయాణికురాలు పట్టుబట్టింది. దీంతో మరోసారి వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మిట్టగూడెం స్టాప్ రావడంతో ఆమె బస్సు దిగేందుకు ప్రయత్నం చేశారు. పరిస్థితి తీవ్రం కావడంతో ప్రయాణికురాలిని అశ్వాపురం పోలీస్? స్టేషన్‌కు తీసుకెళ్లాలని కండక్టర్ నిర్ణయం తీసుకున్నారు.

### కదులుతున్న బస్సు కింద పడి గాయాలు

బస్సును ముందుకు నడపాలని డ్రైవర్‌కు కండక్టర్ సూచించింది. బస్సు కదులుతున్న సమయంలో ప్రయాణికురాలు కండక్టర్?ను నెట్టివేసినట్లు సమాచారం. దీంతో కండక్టర్ కదులుతున్న బస్సు వెనుక చక్రాల కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి.

### మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు

సమాచారం అందుకున్న వెంటనే బాధితురాలిని 108 అంబులెన్స్‌లో భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి ప్రయాణికురాలిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఎల్లయ్య తెలిపారు. "మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్నాం. పూల మార్కెట్?లో మహిళ, వాళ్ల అబ్బాయి బస్సు ఎక్కారు. బాలుడి హాఫ్ టికెట్ కోసం రూ.100 ఇచ్చింది. కండెక్టర్ చిల్లర లేదని చెప్పింది. వాళ్లు గొడవ పడ్డారు. హనుమాన్ ఆలయంవద్ద 10 నిమిషాలు బస్సు ఆపాను. కండెక్టర్ పోలీస్ స్టేషన్‌కు పోదామని చెప్పింది. కొంచెం దూరం వెళ్లాక ప్రయాణికురాలు స్టేషన్ రానని చెప్పింది. బస్సు స్లో అవుతుంటే కండక్టర్‌ను ప్రయాణికురాలు తోసేసింది"

## హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై ఏఐ నిఘా



-మొదటిపేజీ తరువాయి

రాత్రిపూట లారీలు, ట్రక్కులతో వచ్చి తరచూ వ్యర్థాలను పారేస్తున్నారు. గచ్చిబౌలి - నానక్‌రామ్‌గూడ, పెద్దఅంబర్‌పేట్- బాటసింగారం, పటాన్‌చెరు - శంకర్‌పల్లి, అలాగే మేడ్చల్ - షమీర్‌పేట్ మార్గాలలో ఈ సమస్య అధికంగా ఉంది.

### మల్టీ-వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్

ఔటర్ రింగ్ రోడ్డుపై ట్రాఫిక్‌ను నిర్వహించడానికి సైబరాబాద్ పోలీసులు, హెచ్‌ఎండీఏ సహకారంతో ఏఐ ఆధారిత 'మల్టీ - వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్?'ను ప్రవేశపెడుతున్నారు. తరచుగా ప్రమాదాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు జరిగే 14 ప్రాంతాలను కవర్ చేస్తూ, శంషాబాద్ నుంచి మేడ్చల్ వరకు 70 కిలోమీటర్ల మేర ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉల్లంఘనలను గుర్తించి, పరిష్కరించగల సామర్థ్యం ఈ కెమెరాల ముఖ్య లక్షణం. రియల్? టైంలో ఈ-చలాన్లను జారీ చేయడాన్ని సులభతరం చేయడానికి ఉపయోగపడుతుంది.

### నాలుగు కెమెరాలు ఏర్పాటు

ప్రస్తుతం ఈ వ్యవస్థను బంజారా హిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తోపాటు సైబరాబాద్ కమిషనరేట్‌తో అనుసంధానించారు. ఓ ప్రదేశంలో రోడ్డుకు ఇరువైపులా నాలుగు కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి కెమెరా 16 రకాల సంఘటనలు లేదా ఉల్లంఘనలను గుర్తించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అక్రమ వ్యర్థాల డంపింగ్ ఎక్కువగా జరిగే ప్రాంతాలలో, సర్వీస్ రోడ్ల వెంట అలాగే ఇతర వ్యూహాత్మక ప్రదేశాలలో ఇలాంటి కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

## రైస్ మిల్లర్ల అక్రమాలపై ఉక్కుపాదం

-మొదటిపేజీ తరువాయి



టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఇందులో భాగంగా ఎఫ్‌సీఐకి 59.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. అయితే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన సన్నలు రకం ధాన్యాన్ని, మిల్లింగ్ కోసం తీసుకున్న కొందరు మిల్లర్లు, ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముకున్నట్లు అధికారుల దర్యాప్తులో గుర్తించారు. ఆ స్థానంలో బయటి రాష్ట్రాల నుంచి తెప్పించిన నాసిరకం, చౌకైన దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పంపి మోసానికి పాల్పడ్డారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ టాస్క్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో నిర్వహించిన తనిఖీల్లో, ఈ అక్రమాలు వెలుగుచూశాయి. మిల్లుల నుంచి సేకరించిన శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించగా అవి సన్న రకం బియ్యం కాదని తేలినట్లు అధికారులు స్పష్టం చేశారు.

### మూడు జిల్లాలో 14 మంది అరెస్టు

నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న రకం కేటాయింపులకు బదులుగా 3,385.820 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని అప్పగించారని దర్యాప్తులో అధికారులు వెల్లడించారు. దీనివల్ల బోనస్ రూపంలోనే ప్రభుత్వానికి రూ.1.69 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తేల్చారు. మరో 45,414 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మళ్లించేందుకు కుట్ర పన్నగా, పౌర సరఫరాల శాఖ అధికారులు సకాలంలో స్పందించి సరఫరాలను నిలిపివేశారు. దీంతో రూ.242 కోట్ల బోనస్ సొమ్ము దుర్వినియోగం కాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ధాన్యం అక్రమ మళ్లింపు, నమ్మకద్రోహం, కుట్రపూరితంగా ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టడం, వంటి తీవ్రమైన ఆరోపణల ఆధారంగా సీఐడీ అధికారులు రంగంలోకి దిగి మొత్తంగా 14 మందిని అరెస్టు చేశారు. ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్?ను జాకారం జాతీయ రహదారిపై సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్?లోని జమ్మికుంట సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించి, బియ్యం మళ్లింపు వ్యవహారంలో ముగ్గురు కీలక మిల్లర్లను అరెస్ట్ చేశారు. హుజూరాబాద్ వరలక్ష్మి రైస్ మిల్ యజమానిని అదుపులోకి తీసుకున్నారు.

### సివిల్ సప్లైస్ అధికారుల పాత్రపై ఆరా

ప్రభుత్వాన్నికి బకాయిలు చెల్లించని డిఫాల్టర్ మిల్లర్ల మిల్లులు, యంత్రాలు, రవాణా వాహనాలు, వ్యక్తిగత ఆస్తులను జప్తు చేసేందుకు చట్టపరమైన ప్రక్రియ ప్రారంభించారు. అక్రమార్కుల బ్యాంకు ఖాతాలను నిలిపివేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గడిచిన పదేళ్లకుపైగా జరిగిన సీఎంఆర్ లావాదేవీలపై సమగ్ర ఆడిట్‌కు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ధాన్యం కేటాయింపులు, కన్వర్షన్ అనుమతుల్లో సివిల్ సప్లైస్ అధికారుల పాత్ర ఉందా అనే కోణంలో సీఐడీ ఆధారాలు సేకరిస్తోంది.

# బిజినెస్

## ఇక ఎక్స్ ద్వారా కూడా డబ్బులు పంపొచ్చు.. కొత్త ఫీచర్ ప్రకటించిన ఎలాన్ మస్క్..!



ఇక నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్ ద్వారా కూడా డబ్బులు పంపించవచ్చు. ఈ మేరకు ఎక్స్ చీఫ్ ఎలాన్ మస్క్ తమ యూజర్ల కోసం ఆసక్తికరమైన ఫీచర్‌ను ప్రతిపాదించారు. ఎక్స్‌లో ఏదైనా పోస్ట్ నచ్చితే దాని కింద ఉన్న 'లైక్ బటన్'ను లాంగ్ ప్రెస్ చేయడం ద్వారా ఆ పోస్ట్ చేసిన వారికి ఒక డాలర్ పంపే సౌకర్యాన్ని తీసుకువస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈ ఫీచర్ ద్వారా సులభంగా చిన్న మొత్తంలో డబ్బు పంపించుకునే అవకాశం కలుగుతుంది. ఎక్స్‌ను కేవలం సోషల్ నెట్‌వర్కింగ్ వేదికగానే కాకుండా ఫైనాన్షియల్ సర్వీసులతో కూడిన ఒక 'ఎవ్రీథింగ్ యాప్'గా మార్చాలన్న మస్క్ విస్తృత వ్యూహంలో ఈ కొత్త ఫీచర్ ఒక భాగమని తెలుస్తున్నది. ఎక్స్ మనీ ద్వారా ఒకరికి 1 డాలర్ పంపడానికి, లైక్ బటన్‌పై లాంగ్ ప్రెస్ చేసే సదుపాయాన్ని తీసుకొస్తున్నామని మస్క్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఫీచర్ ముఖ్యంగా కంటెంట్ క్రియేటర్లకు టిప్స్ ఇవ్వడానికి, వినియోగదారులకు నచ్చిన పోస్టులను ఆర్థికంగా ప్రోత్సహించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఈ చెల్లింపుల ప్రక్రియ 'ఎక్స్ మనీ' ద్వారా జరుగుతుంది. ఇటీవల అమెరికాలో ప్రారంభమైన 'ఎక్స్ మనీ' సేవలు పీర్-టు-పీర్ నగదు బదిలీలకు, డిజిటల్ చెల్లింపులకు అనుమతిస్తున్నాయి. దీంతోపాటు, ఫిజికల్, డిజిటల్ లావాదేవీలకు ఉపయోగపడే 'ఎక్స్ వీసా డెబిట్ కార్డ్'ను కూడా అందిస్తున్నారు. ఈ కార్డును యాపిల్ పేకు సైతం లింక్ చేసుకోవచ్చు. అయితే ప్రస్తుతానికి 'ఎక్స్ మనీ' సేవలు, కొత్తగా ప్రతిపాదించిన ఈ 'లైక్' బటన్ పేమెంట్ ఫీచర్ కేవలం అమెరికా మార్కెట్‌కే పరిమితం. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ పేమెంట్స్ మార్కెట్లలో ఒకటైన భారత్ సహా ఇతర దేశాల్లో ఈ సేవలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయనే విషయాన్ని కంపెనీ ఇంకా స్పష్టం చేయలేదు. ఈ కొత్త ఫీచర్ అమలుకు సంబంధించిన పూర్తి వివరాలు, కాలపరిమితిని కూడా వెల్లడించాల్సి ఉంది.

## జియో రీచార్జ్: 200 రోజుల ప్లాన్.. 500జీబీ డేటా!

టెలికాం రంగంలో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో.. రిలయన్స్ జియో ఎప్పటికప్పుడు తన వినియోగదారులను ఆకట్టుకునేందుకు ప్రత్యేక రీఛార్జ్ ప్లాన్లను పరిచయం చేస్తోంది. ఇందులో భాగంగా రూ.2,025 ప్లాన్ ద్వారా డేటా, అన్‌లిమిటెడ్ కాలింగ్‌తో పాటు ఏఐ, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయోజనాలను కూడా అందిస్తోంది. 200 రోజుల వ్యాలిడిటీతో వచ్చే ఈ ప్లాన్‌లో రోజువారీ డేటాతో పాటు పలు అదనపు సదుపాయాలు లభిస్తాయి. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే రోజుకు 2.5+దీ హైస్పీడ్ డేటా పొందవచ్చు. 200 రోజులు కాబట్టి.. మొత్తం 500+దీ డేటా అందుబాటులో ఉంటుందన్నమాట. దీంతో పాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చు. అర్హత కలిగిన వినియోగదారులకు అన్‌లిమిటెడ్ 5జీ డేటా ప్రయోజనం కూడా లభిస్తుంది. రోజువారీ హైస్పీడ్ డేటా లిమిట్ పూర్తయిన తర్వాత ఇంటర్నెట్ వేగం 64 కేబీపీఎస్‌కు తగ్గుతుంది.

## 5 కంపెనీలు.. 2600 కోట్లు.. ఈ వారం ఐపీఓలు ఇవే

**ఇంటర్నెట్ డెస్క్:** గత వారమంతా జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓదే హవా. ఈ వారం కూడా ప్రైమరీ మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగనుంది. ఐదు కంపెనీలు దాదాపు రూ.2,600 కోట్ల నిధులను మార్కెట్ నుంచి సమీకరించనున్నాయి. ఇందులో ఈఏఏఏ ఇండియా అల్ట్రార్నేటివ్స్, ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ వంటి కంపెనీలు ఉన్నాయి. ఐపీఓ నిధులను కార్పొరేట్ అవసరాలకు, రుణాల చెల్లింపులకు కంపెనీలు వినియోగించనున్నాయి.





ఎడెల్వీస్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన ఈఏఏఏ ఇండియా ఆల్టర్నేటివ్స్ రూ.1200 కోట్ల నిధుల సమీకరణతో పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబర్ 26న సబ్‌స్క్రిప్షన్ మొదలై.. అక్టోబర్ 28న ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.1,585-1,665గా కంపెనీ నిర్ణయించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయిస్తున్నారు. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ ఇప్పటికే రూ.360 కోట్ల నిధులను సమీకరించింది.

వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్ రూ.668 కోట్ల నిధుల సమీకరణతో పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబర్ 27న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. అక్టోబర్ 29న ముగియనుంది. ధరల శ్రేణి రూ.313-330గా కంపెనీ నిర్ణయించింది. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద కంపెనీ మార్కెట్ విలువ రూ.3,233 కోట్లు. రూ.150 కోట్ల విలువైన తాజా షేర్లు, 1.57 కోట్ల ఆఫర్ ఫర్ సేల్‌లో విక్రయించనున్నారు.

ఎంకే సన్స్ ఫైన్ జువెల్స్ లిమిటెడ్ రూ.275.4 కోట్ల నిధుల సమీకరణతో అక్టోబర్ 28న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబర్ 30న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.153-162గా కంపెనీ నిర్ణయించింది. 1.36 కోట్ల తాజా షేర్లు, 34 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయించనున్నారు.

బీఎల్ఎస్ పాలీమర్స్ లిమిటెడ్ రూ.255 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంలో ఐపీఓకు రానుంది. అక్టోబర్ 27న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. అక్టోబర్ 29న ముగియనుంది. ధరల శ్రేణి రూ.142-150గా కంపెనీ నిర్ణయించింది. 1.7 కోట్ల తాజా షేర్లు ఉన్నాయి.

బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్ లిమిటెడ్ రూ.183.1 కోట్ల ఐపీఓతో అక్టోబర్ 29న సబ్‌స్క్రిప్షన్‌కు వస్తుంది. నవంబర్ 2న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ధరల శ్రేణి రూ.78-82. ఈక్విటీ షేర్లను పూర్తిగా తాజా షేర్ల రూపంలో విక్రయిస్తున్నారు.

ఎఫ్‌పీఐల విక్రయాలు.. అక్టోబర్‌లో ?48,056 కోట్ల నిధులు వెనక్కి

28న జియో కంపెనీ షేర్లు లిస్టింగ్

రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ సేవల సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ (జేపీఎల్) షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అక్టోబర్ 28న లిస్టింగ్ కానున్నాయి.

## 4 లక్షల నుంచి 2 లక్షలకు.. వెండి ధర ఎందుకు తగ్గుతోంది?





ఇంటర్నెట్ డెస్క్: బంగారం, వెండి ధరలు గత కొన్ని రోజులుగా విలువను కోల్పోతున్నాయి. ఇంధన ధరలు పెరుగుతుండడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, వడ్డీ రేట్ల పెంపు వంటివి ఈ రెండు లోహాలపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా వెండి గరిష్ఠాల నుంచి సగానికి పైగా పతనమై రూ.2 లక్షల దిగువకు చేరింది. వెండి ఈ ఏడాది జనవరిలో ఔన్సు 120 డాలర్లు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో దీని ధర అప్పట్లో రూ.4 లక్షలు దాటింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు వెండి 53 డాలర్లకు పడిపోయింది. దీంతో కిలో వెండి ధర రూ.1.9 లక్షలకు చేరింది. పశ్చిమాసియా సంక్షోభం, ముఖ్యంగా సౌదీ అరేబియాలో చోటుచేసుకుంటున్న ఇటీవలి పరిణామాల వల్ల చమురు ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ప్రస్తుతం 116 డాలర్లకు చేరుకుంది. దీంతో ద్రవ్యోల్బణ భయాలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం ముప్పు వల్ల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను దీర్ఘకాలం పాటు గరిష్ట స్థాయిలోనే ఉంచుతుందన్న అంచనాలు బలపడ్డాయి. దీనివల్ల అమెరికా డాలర్ బలపడి బంగారం, వెండి వంటి విలువైన లోహాలపై ఒత్తిడి పడుతోంది. మరోవైపు బంగారంతో పోలిస్తే వెండిని పారిశ్రామిక అవసరాలకు ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే, ప్రపంచ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల వల్ల ఆర్థిక వృద్ధి మందగిస్తుందన్న ఆందోళనలు వెండికి పారిశ్రామిక డిమాండ్ తగ్గింది. దీంతో వెండి ధర పతనం అవుతోంది.

## యూట్యూబ్ ప్రీమియంతో ఎయిర్‌టెల్, జియో ప్లాన్స్ ఇవే





ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ టెలికాం కంపెనీలైన ఎయిర్‌టెల్, జియో ఎంపిక చేసిన ప్లాన్లపై యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా అందిస్తున్నాయి దీంతో యూట్యూబ్‌లో యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్ పొందొచ్చు. యూట్యూబ్ ప్రీమియం కావాలంటే వేరేగా సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రత్యేకమైన వోచర్లను రీఛార్జ్ చేసుకుంటే.. యూట్యూబ్ ప్రీమియాన్ని ఉచితంగా పొందొచ్చు. రెండు కంపెనీలూ రూ.200 డేటా వోచర్‌పై ఈ ఆఫర్‌ను అందిస్తున్నాయి. 30+దీ హై స్పీడ్ డేటా, 28 రోజుల వ్యాలిడిటీతో వస్తున్నాయి. ఈ ఆఫర్‌ను పొందాలంటే కచ్చితంగా ప్రీపెయిడ్ రీఛార్జ్ కలిగి ఉండాలి. ఎయిర్‌టెల్‌లో రూ.200 డేటా వోచర్ ప్లాన్‌తో యూట్యూబ్ ప్రీమియంతో పాటు ప్రైమ్ వీడియో, జియో హాట్‌స్టార్, జీ5, సోనీలివ్ వంటి ఇతర 18కి పైగా ఓటీటీ ప్లాట్‌ఫాంల ఉచిత యాక్సెస్ లభిస్తుంది. జియో విషయానికొస్తే.. రూ.200 డేటా వోచర్‌తో యూట్యూబ్ ప్రీమియంతో పాటు జియో టీవీ మొబైల్ యాప్ ద్వారా ప్రైమ్ వీడియో, జియోహాట్‌స్టార్, సోనీలివ్, జీ5, సన్‌ఎన్ఎక్స్‌టీ, లయన్‌గేట్ ప్లే, డిస్కవరీం, ఈటీవీ విన్ వంటి ఓటీటీ ప్రయోజనాలు పొందొచ్చు. అదనంగా సినీపోలిస్ పై రూ.150 డిస్కౌంట్ అందిస్తోంది. రోజువారీ 1+దీ లేదా 1.5+దీ డేటా కలిగిన అర్హత గల ప్రీపెయిడ్ ప్లాన్‌లపై అన్‌లిమిటెడ్ 5+ డేటాను కూడా అందిస్తోంది.

# భారత స్పిన్నర్ల ధాటికి జింబాబ్వే విలవిల..

## మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ విజయం

- జింబాబ్వేతో వన్డే సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు
- రెండో వన్డేలో 121 పరుగుల భారీ తేడాతో విజయం
- హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ అద్భుత సెంచరీలు
- భారీ లక్ష్య ఛేదనలో తడబడిన జింబాబ్వే
- 4 వికెట్లతో చెలరేగిన వైష్ణవి శర్మ, 3 వికెట్లు తీసిన దీప్తి



జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనను కొనసాగించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (126), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (106లి) అద్భుత శతకాలతో చెలరేగడం, ఆ తర్వాత బౌలర్లు రాణించడంతో భారత్ 121 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. వడోదర వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ స్మృతి మంధాన (0), షఫాలీ వర్మ (8) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 19 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ప్రతీక రావల్ (61)తో కలిసి హర్మన్‌ప్రీత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఆ తర్వాత దీప్తి శర్మ జత కలవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మలు జింబాబ్వే బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి శతకాలతో కదం తొక్కారు. దీంతో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. 329 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వేకు మంచి ఆరంభమే లభించింది. 20 ఓవర్లు ముగిసేసరికి ఒక వికెట్ నష్టానికి 104 పరుగులు చేసి పోరాడే సంకేతాలు ఇచ్చింది. ముపచిక్వా (49), తిరిపానో (46) రాణించారు. అయితే, ఆ తర్వాత భారత స్పిన్నర్లు విజృంభించారు. స్పిన్ త్రయం వైష్ణవి శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి ధాటికి జింబాబ్వే బ్యాటర్లు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయారు. వైష్ణవి శర్మ 4 వికెట్లతో చెలరేగగా, బ్యాటింగ్‌లో సెంచరీతో మెరిసిన దీప్తి శర్మ బౌలింగ్‌లోనూ 3 వికెట్లు పడగొట్టి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. దీంతో జింబాబ్వే జట్టు 48.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌట్ అయింది.

# స్పోర్ట్స్

## ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో పీవీ సింధు ఓటమి..

### టైటిల్ గెలుచుకున్న వరల్డ్ నెంబర్ వన్ అన్ సె యంగ్





ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో భారత క్రీడాకారిణి పీవీ సింధు ఓటమి పాలైంది. దక్షిణ కొరియాకు చెందిన క్రీడాకారిణి అన్ సె యంగ్ చేతిలో ఓడిపోయింది. దీంతో ఫ్రెంచ్ ఓపెన్ ఉమన్స్ సింగిల్ టైటిల్‌ను అన్ సె యంగ్ దక్కించుకుంది. ప్యారిస్‌లోని అరెనా గ్రాండ్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్‌లో సింధు.. వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్ ప్లేయర్ అన్ సె యంగ్ చేతిలో ఓటమి పాలైంది. మూడు గేమ్‌లుగా గంటకుపైగా ఈ గేమ్ సాగింది. మొదటి గేమ్‌లో 16-21తో సింధు ఆధిక్యం ప్రదర్శించింది. ఒక దశలో సింధు ఆటతీరుకు యంగ్ ఆందోళనకు గురైంది. అయితే, ఆ తర్వాత యంగ్ తన పోరాట పటిమ ప్రదర్శించింది. సింధుకు ధీటుగా దూసుకెళ్లింది. ఫలితంగా తర్వాత సాగిన రెండు గేమ్‌లలో సింధు ఇదే ఆట తీరు చూపలేకపోయింది. దీంతో తర్వాతి రెండు గేమ్‌లను 21-11, 21-12తో సింధు కోల్పోయింది. దీంతో సింధు.. టైటిల్ కోసం జరిగిన తుదిపోరులో ఓటమి పాలైంది. అన్ సె యంగ్.. ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా నిలిచింది. ఈ విజయంతో అన్ సె యంగ్ వరుసగా నాలుగోసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలుచుకుంది. ఇంతకుముందు సింధు-యంగ్ మధ్య 11 మ్యాచులు జరగగా.. 11సార్లు సింధు ఓటమిపాలైంది.

## జెన్-జీకి ఎమ్మెస్ ధోని సూచన.. అలాంటి అలవాట్లతో ఆరోగ్యం పాడవుతుందంటూ ఆందోళన

జెన్-జీ ఆహారపు అలవాట్లు, జీవనశైలిపై భారత మాజీ క్రికెటర్ ఎమ్మెస్ ధోని ఆందోళన వ్యక్తం చేశారు. వీటివల్ల దీర్ఘకాలికంగా వారి ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉందన్నారు. తాజాగా ఒక కార్యక్రమంలో ప్రముఖ రచయిత జావేద్ అక్తర్‌తో కలిసి ధోని పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెన్-జీకి కీలక సూచన చేశారు. జెన్-జీ, జెన్-ఆల్ఫా పాటిస్తున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలితో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. వారి ఆహారపు అలవాట్లు ఆందోళనకరంగా ఉన్నాయని, మార్చుకోవాలని సూచించారు. అలాగే, శారీరక శ్రమ, మంచి ఆహారంపై దృష్టి సారించాలన్నారు. అయితే, ఇప్పటి తరంలో కొందరు గతంకంటే మెరుగైన సామాజిక, నైతిక విలువలు పాటిస్తున్నారని, ఇది హర్షణీయం అన్నారు. అలాగే, పెద్దలు కూడా ఎప్పుడూ తామే సరైన వాళ్లం అనుకోకుండా, కొత్త తరం నుంచి కూడా నేర్చుకోవడానికి ప్రయత్నించాలని సలహా ఇచ్చారు. భారతీయులు ఎక్కువగా కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం తీసుకుంటారనే విషయంపై కూడా ధోని మాట్లాడారు. భారతీయుల జీవనశైలి, శారీరక శ్రమ కారణంగా కార్బోహైడ్రేట్లు ఎక్కువగా తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం మారిన రోజువారీ జీవనశైలి, ఎక్కువగా యాక్టివ్‌గా లేకపోవడం, ఒకేరకమైన ఆహారం తీసుకోవడం వంటివి ఇప్పుడు చాలా మందికి సరిపోకపోవచ్చు అన్నారు.



# సాయిదుర్గ తేజ్ కొత్త సినిమాలో 'కాంతార' బ్యూటీ..

## అటవీ నేపథ్యంలో భారీ యాక్షన్ డ్రామా!

మెగా సుప్రీం హీరో సాయిదుర్గా తేజ్ వరుసగా విభిన్న కథాంశాలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు వైవిధ్యమైన చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. దర్శకుడు తేజ కాకుమాను తెరకెక్కించనున్న ఈ సినిమాను నిర్మాత అనిల్ సుంకర నిర్మించనున్నారు. అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సాయిదుర్గా తేజ్, తేజ కాకుమాను కాంబినేషన్‌లో రానున్న ఈ కొత్త సినిమా కథాంశంపై ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో అడవి నేపథ్యంలో సాగే సన్నివేశాలు, భారీ యాక్షన్ ఎపిసోడ్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, ఈ నెలాఖరులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించే యోచనలో చిత్రబృందం ఉన్నట్లు సమాచారం. అయితే షూటింగ్ ప్రారంభ తేదీ, కథాంశానికి సంబంధించిన పూర్తి వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాలో సాయిదుర్గా తేజ్‌కు జోడీగా కన్నడ నటి సప్తమి గౌడ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఈ సినిమాలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతోంది. అయితే చిత్రబృందం నుంచి పూర్తి క్లారిటీ రావాల్సి ఉంది. సప్తమి గౌడ గతంలో నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అలాగే హిందీ చిత్రం 'ది వ్యాక్సిన్ వార్'లోనూ నటించారు. కన్నడ చిత్ర పరిశ్రమలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు సాయిదుర్గా తేజ్ సరసన అవకాశం వస్తే, అది ఆమె కెరీర్‌కు మరో ముఖ్యమైన ప్రాజెక్ట్‌గా నిలిచే అవకాశం ఉంది. మరోవైపు సాయిదుర్గా తేజ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'పై కూడా అంచనాలు ఉన్నాయి. రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోంది. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

# నవంబర్ 1న ఆర్‌సీ17 పూజా కార్యక్రమాలు

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మరియు క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న ప్రాజెక్ట్ ఆర్‌సీ 17 ఇండస్ట్రీలో సంచలనాత్మక విజయాలను నమోదు చేసిన 'రంగస్థలం' చిత్రం తర్వాత ఈ క్రేజీ కాంబో మరోసారి రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందా అని మెగా అభిమానులు మరియు సినీ ప్రియులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న తరుణంలో, ఎట్టకేలకు మేకర్స్ నుంచి మోస్ట్ ఎవైటెడ్ అఫీషియల్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మొదటగా దసరా పండుగ రోజునే అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో లాంచ్ చేయాలని చిత్ర యూనిట్ భావించింది. అయితే ఆ సమయంలో ముహూర్తం సరిపడకపోవడం మరియు కొన్ని సాంప్రదాయ కారణాలరీత్యా ఈ ఓపెనింగ్ కార్యక్రమాన్ని కొద్దిరోజులు వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత అక్టోబర్ చివరి వారంలో ఈ సినిమా లాంఛింగ్ ఉంటుందని మైత్రీ మూవీ మేకర్స్ సహ నిర్మాత వై.రవిశంకర్ గతంలో హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా జరిగిన ఒక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ఖచ్చితమైన తేదీని అధికారికంగా రివీల్ చేశారు. వచ్చే నెల నవంబర్ 1వ తేదీన ఎంతో గ్రాండ్‌గా ఆర్‌సీ 17 పూజా కార్యక్రమాలను నిర్వహించి ఈ చిత్రాన్ని అధికారికంగా లాంచ్ చేయబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కేవలం పూజతో సరిపెట్టకుండా, లాంఛింగ్ పూర్తయిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రెగ్యులర్ షూటింగ్ పనులను కూడా శరవేగంగా ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. సుకుమార్ మార్క్ మేకింగ్, రామ్‌చరణ్ గ్లోబల్ ఇమేజ్ తోడవుతుండటంతో ఈ సినిమా ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు కావడంతో మెగా అభిమానులు ప్రస్తుతం ఫుల్ ఖుష్ అవుతున్నారు మరియు సోషల్ మీడియాలో ఈ అప్‌డేట్‌ను ట్రెండ్ చేస్తున్నారు.



# సూర్య సినిమా కోసం 'కల్ట్' టైటిల్ అడిగారు.. కానీ నేను ఇవ్వలేదు విశ్వక్ సేన్

టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తాజాగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ కల్ట్. ఈ సినిమా టైటిల్‌కు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త టాలీవుడ్ వర్గాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించబోయే ఒక భారీ సినిమా కోసం చిత్ర యూనిట్ సభ్యులు ముందుగా ఈ 'కల్ట్' టైటిల్‌ను తమకు ఇవ్వాలని అడిగినట్లు విశ్వక్ సేన్ స్వయంగా వెల్లడించారు. తమ సినిమా కథకు మరియు నేపథ్యానికి ఈ టైటిల్ అత్యంత సరిగ్గా సరిపోతుందని వారు భావించినట్లు ఆయన తెలిపారు. అయితే, ఆ టైటిల్ తన సినిమాలోని పాత్రకు, కథాంశానికి మరింత పర్ఫెక్ట్‌గా సూట్ అవుతుందని గట్టిగా నమ్మడంతో, సూర్య టీమ్ అడిగినప్పటికీ తాను ఆ టైటిల్‌ను ఇవ్వడానికి సున్నితంగా నిరాకరించినట్లు విశ్వక్ సేన్ స్పష్టం చేశారు. అయితే, అది సూర్య నటించబోయే ఏ సినిమాకు సంబంధించిన టైటిల్ అనే దానిపై మాత్రం ఆయన ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ప్రస్తుతం ఈ ఇంట్రెస్టింగ్ మేటర్ టాలీవుడ్ మరియు కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారగా, దీనికి సంబంధించిన చర్చలు సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి.



# రాముడు, సీత ప్రేమకు సంగీత రూపం..

## 'రామాయణ' నుంచి 'రంగులు రంగులే' పాట విడుదల!



భారతీయ ఇతిహాసం 'రామాయణం' ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం నుంచి విడుదలవుతున్న ప్రతి ప్రచార చిత్రం, పాట ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి మూడో పాటగా 'రంగులు రంగులే' విడుదలైంది. శ్రీరాముడు, సీతాదేవి మధ్య ఉన్న ప్రేమానుబంధాన్ని ఆవిష్కరిస్తూ రూపొందించిన ఈ పాట శ్రోతలను ఆకట్టుకుంటోంది. మధురమైన సంగీతం, హృద్యమైన సాహిత్యం, అందమైన దృశ్యాలతో పాటను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆయన తనదైన శైలిలో మధురమైన స్వరాలను, ఆకట్టుకునే సంగీత వాయిద్యాలను మేళవించి పాటను రూపొందించారు. గేయ రచయిత రాకేందు మౌళి అందించిన సాహిత్యం రాముడు, సీతల మధ్య ఉన్న అనుబంధాన్ని, వారి భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఉంది. రాఘవ్ కౌశిక్, వైశాలి సామంత్ తమ స్వరాలతో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. 'రంగులు రంగులే' పాటలో రాముడు, సీతల జీవిత ప్రయాణంలోని కీలక ఘట్టాలను చూపించారు. స్వయంవరంలో తొలిసారి కలుసుకోవడం, ఆ తర్వాత వివాహ బంధంతో ఒక్కటవడం, అయోధ్యలో కలిసి గడిపిన మధుర క్షణాలు, అరణ్యవాసానికి బయలుదేరడం వంటి సన్నివేశాలు పాటలో కనిపిస్తాయి. ఈ దృశ్యాల ద్వారా వారి ప్రేమలోని ఆప్యాయత, పరస్పర అనుబంధం, జీవితంలో ఎదురైన కీలక మలుపులను చూపించే ప్రయత్నం చేశారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటిస్తున్నారు. వీరిద్దరూ తెరపై కనిపించే తీరు, పాత్రలకు అనుగుణంగా వారి హావభావాలు ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. భారీ స్థాయిలో రూపొందుతున్న 'రామాయణ'ను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మొదటి భాగాన్ని నవంబరు 5న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. తాజాగా విడుదలైన 'రంగులు రంగులే' పాట రాముడు, సీతల ప్రేమకథను సంగీత రూపంలో ఆవిష్కరించడంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512